PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 228 | విజయవాడ, మంగళవారం 21 మార్చి 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tuesday 21 March 2023 | Rs

సిటీ◆

రైతులను రక్షించండి.. దేశాన్ని కాపాడండి

- దేశ నలుమూలలకూ ఆందోళన
- కిసాన్ మహాపంచాయత్‌లో ఎస్‌కెఎం నేతలు
- డిమాండ్లపై కేంద్ర మంత్రికి వినతి

లోపలి పేజీలో..

పార్వతీపురంలో స్పృహతప్పి పడిపోయిన అంగన్‌వాడీ హెల్పర్ దోకల అరుణ



బాహాబాహీ



- రణరంగంగా మారిన అసెంబ్లీ
- భౌతిక దాడులకు దిగిన ఎమ్మెల్యేలు
- జిఓ నెంబరు 1పై చర్చకు టిడిపి పట్టు
- స్పీకరు పోడియం ముట్టడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ ఏడోరోజు సమావేశాలు రణరంగాన్ని తలపించాయి. గతంలో ఎన్నడూ లేని విధ్వంస సంస్కృతికి సభ్యులు తెరలేపారు. టిడిపి, వైసిపి సభ్యుల మధ్య ధూషణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లు, భౌతిక దాడులతో సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన కొద్దిసేపటికే ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభలో ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రజాస్వామ్యవాదుల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం జిఓ నెంబరు 1ను తీసుకొచ్చిందని, ఈ విషయంపై చర్చకు అనుమతించాలని కోరుతూ టిడిపి సభ్యులు డోలా బాలవీరాంజనేయస్వామి, ఏలూరి సాంబశివరావు, మంతెన రామరాజు వాయిదా తీర్మానం ఇచ్చారు. అసెంబ్లీ ప్రారంభం కాగానే తమ వాయిదా తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, చర్చకు అనుమతించాలని టిడిపి సభ్యులు పట్టుబట్టారు. ఇదే సందర్భంలో వైసిపి సభ్యులు టిడిపి సభ్యులపై విమర్శల దాడి మొదలుపెట్టారు. టిడిపి సభ్యులు స్పీకరు పోడియాన్ని ముట్టడించి, స్పీకరు ఛైర్‌కు రెండు వైపులా నిలబడిన సభ్యులు జిఓ నెంబరు 1పై చర్చించాలని ప్లకార్డును ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. టిడిపి సభ్యులు డోలా బాలవీరాంజనేయస్వామి ప్లకార్డును స్పీకరు ముఖానికి దగ్గరకు తీసుకెళ్లడంతో స్పీకరు చేతితో ఆ ప్లకార్డును పక్కకు తోసేసినట్లు తెలిసింది. అది కిందపడటంతో స్పీకరు, డోలా మధ్య స్వల్ప వాగ్వాదం జరుగుతున్న సందర్భంలో వైసిపి ఎమ్మెల్యే ఎలీజా స్పీకరు పోడియం వద్దకు దూసుకెళ్లారు. స్పీకరుకు రక్షణగా పోడియంపైకి వెళ్లినట్లు వైసిపి వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే సందర్భంలో డోలాపై స్పీకరు దాడి చేశారంటూ టిడిపి సభ్యులు ఆరోపించారు. అది జరుగుతున్నపుడే సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజె సుధాకర్‌బాబు పోడియంపైకి వెళ్లి బాలవీరాంజనేయస్వామి చేయి పట్టుకుని పక్కకు తోసే ప్రయత్నం చేయడంతో బాలవీరాంజనేయస్వామి తిరిగి అదే వేగంగా సుధాకర్‌బాబును నెట్టారు. బాలవీరాంజనేయస్వామి కిందపడడంతో టిడిపి సభ్యుడు బెందాళం అశోక్, సుధాకర్‌బాబు, ఎలీజాను స్పీకరు పోడియం నుంచి కిందకు నెట్టివేశారు. దీంతో వైసిపి సభ్యులు పరుగుపరుగున స్పీకరు పోడియం పైకి దూసుకెళ్లారు. దీంతో మార్షల్స్ రంగ ప్రవేశం చేశారు. స్పీకరు సభనుంచి బయటకు వెళ్లిపోయారు. వైసిపి, టిడిపి సభ్యులు ఒకరిపై ఒకరు దూసుకురావడం, సభలో ఉపయోగించరాని భాషను ఉపయోగిస్తూ ధూషణలు, వ్యక్తిగత ఆరోపణలతో అసెంబ్లీని రణరంగంగా మార్చారు. సీనియర్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు దాడికి యత్నించడంతో వైసిపి సభ్యులు ఆయనను వెనక్కి తీసుకెళ్లారు. టిడిపి సభ్యుల వైపు దూసుకెళ్తున్న వైసిపి సభ్యులను అంబటి రాంబాబు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి వెనక్కి తీసుకురాగా, టిడిపి సభ్యులు వైసిపి వారిపైకి వెళ్లకుండా గొట్టిపాటి రవికుమార్ అడ్డుకున్నారు. దూషణల పర్వం కొద్దిసేపు సాగింది. సభ తిరిగి ప్రారంభం కాగానే టిడిపి సభ్యులను ఒకరోజు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకరు తమ్మినేని సీతారాం ప్రకటించారు. అనంతరం టిడిపి సభ్యులను మార్షల్స్‌కు బయటకు తీసుకెళ్లారు. ఇదే అంశంపై జరిగిన చర్చలో మంత్రి అంబటి రాంబాబు, ప్రసాదరాజు, మల్లాది విష్ణు, ఆదిమూలపు సురేష్, ఆర్‌కె రోజా, కాపు రామచంద్రారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉషశ్రీ

మిగతా 2లో

విజయవాడ ఏలూరు రోడ్డులో బైఠాయించిన అంగన్‌వాడీలు





బేబిరాణిని ఈడ్చుకు వెళ్తున్న పోలీసులు

ఈడ్చేశారు



సుబ్బరావమ్మ అరెస్టు

అంగన్‌వాడీలపై పోలీసుల దాష్టీకం - వేలాది మంది అరెస్టు

- గాయాలపాలై సొమ్మసిల్లిన అంగన్‌వాడీ మహిళలు
- నిరసనగా సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శుల నిరాహారదీక్ష
- విజయవాడలో ఉద్రిక్తత
- రాష్ట్రమంతటా ఆందోళనలు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల 'చలో విజయవాడ'పై అర్ధరాత్రి అరెస్టులు, బెదిరింపులు, దౌర్జన్యాలతో ప్రభుత్వం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని విన్నవించుకునేందుకు వచ్చిన వారిని అడ్డుకునేందుకు అన్ని రకాల నిర్బంధపు ట్రిక్కులను ప్రయోగించింది. ఈ నిర్బంధాలన్నిటిని అధిగమించి విజయవాడ చేరుకున్న వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలను మహిళలని కూడా చూడకుండా పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి వాహనాల్లో ఎక్కించి స్టేషన్లకు తీసుకెళ్లారు. పోలీసుల దాష్టీకానికి కొందరు అంగన్‌వాడీలు స్పృహ తప్పి పడిపోయారు. ఇంకొందరికి గాయాలయ్యాయి. ఒక్క విజయవాడలోనే మూడు వేల మందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె సుబ్బరావమ్మతో సహా పలువురు నాయకులను విజయవాడలో అరెస్టు చేశారు. అంగన్‌వాడీలపై అమానుషత్వానికి నిరసనగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఇతర నాయకులు విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో నిరాహార దీక్ష చేశారు. రాష్ట్రమంతటా ఇదే విధమైన నిర్బంధాన్ని ప్రభుత్వం ప్రయోగించింది.

విజయవాడ ధర్నాకు వచ్చిన వారిని ధర్నా చౌక్‌కు వెళ్లకుండా రైల్వేస్టేషన్, బస్టాండ్, లెనిన్ సెంటర్, దుర్గాపురం, గుణదల, పడవలరేవు, బిఆర్‌టిఎస్ రోడ్డు, ఫుడ్ జంక్షన్, సిఆర్‌డిఎ కార్యాలయం, ఏలూరు

మిగతా 2లో

బంగారం మరింత ప్రియం

- ఒకే రోజు రూ.1400 పెరిగిన పసిడి



న్యూఢిల్లీ : పేద, సామాన్యులు ఇక బంగారం కొనలేరేమో. పది గ్రాముల పసిడి ధర ఏకంగా రూ.60వేలు దాటింది. సోమవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారంపై ధర రూ.1400 పెరిగి రూ.60,100కి చేరిందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ వెల్లడించింది. ఇంతక్రితం సెషన్‌లో ఈ లోహం ధర రూ.58,700 వద్ద ముగిసింది. తాజాగా కిలో వెండిపై రూ.1,860 పెరిగి రూ.69,340కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్క ఔన్స్ బంగారం, వెండి ధరలు వరుసగా 2,005 డాలర్లు, 22.55 డాలర్లుగా నమోదయ్యాయి. ఇటీవల బ్యాంకింగ్ రంగంలోని సంక్షోభ పరిణామాలు బంగారం ధరలకు రెక్కలొచ్చేలా చేస్తున్నాయి.

లోపలి పేజీలో..

బ్రిటన్‌లో భారత రాయబార కార్యాలయంపై ఖలిస్తాన్ మద్దతుదారుల దాడి

- అమెరికాలోనూ..

నేడు మళ్లీ ఇడి ముందుకు కవిత

- పది గంటలపాటు విచారణ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను మరోసారి విచారణకు రావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నోటీసులు జారీ చేసింది. కవితను మంగళవారం ఉదయం 11 గంటలకు రమ్మన్నారు. సోమవారం కవితను ఇడి అధికారులు దాదాపు పది గంటలకు పైగా విచారించారు. డాక్యుమెంటేషన్, వాంగ్మూలంపై కవిత సంతకాలు కూడా తీసుకున్నారు. ఇడి సంధించిన పలు ప్రశ్నలకు కవిత నుంచి ఎలాంటి రియాక్షన్ లేదని తెలిసింది. మొత్తం 20 ప్రశ్నలు కవితకు సంధించినట్లు సమాచారం. ఉదయం కవిత, అరుణ్ పిళ్లైని కలిపి ఇడి అధికారులు విచారించారు. పిళ్లైతో కవితకు ఉన్న వ్యాపార సంబంధాలు, మద్యం కుంభకోణంలో సౌత్ గ్రూప్ పాత్రపై కవితను ఇడి ప్రశ్నించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తొలుత ఉదయం 10:20 గంటలకు సిఎం కెసిఆర్ నివాసంలో అందిరికీ పిడికిలి చూపిస్తూ కవిత అభివాదం చేశారు. అక్కడ నుంచి తన భర్త అనిల్‌తో కలిసి ఇడి ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఆమె భర్తను నిలిపివేశారు. ఆమె ఒక్కరినే అనుమతించారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ 3 వరకూ రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఇదే కేసులో పిళ్లైకి సిబిఐ ప్రత్యేక కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అభిషేక్ బోయిన్‌పల్లికి మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది.

వి శ్రీనివాసరావును అరెస్టు చేస్తున్న పోలీసులు



చలో అసెంబ్లీ ఉద్రిక్తం

జిఓ 1 రద్దు పోరాట కమిటీ నాయకుల అరెస్టు

- ప్రతిఘటించిన శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు
- పోలీసు స్టేషన్లో నిరాహారదీక్ష
- అంబేద్కర్ విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిఓ నెంబరు 1 రద్దు చేయాలని పోరాట కమిటీ ఇచ్చిన చలో అసెంబ్లీ పిలుపు ఉద్రిక్తంగా మారింది. విజయవాడలోని తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రం ముందున్న అంబేద్కర్ విగ్రహం నుండి అసెంబ్లీకి బయలుదేరిన పోరాట కమిటీ, సిపిఎం, సిపిఐ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరావు, వి.వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వనజ, టిడిపి నాయకులు రఘు, పరుచూరి ప్రసాదు, కాంగ్రెస్ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు తదతరులను అరెస్టు చేసి వేర్వేరు స్టేషన్లకు తరలించారు. అరెస్టు సమయంలో పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. నాయకులను ఈడ్చివేశారు. విద్యార్థి, యువజన సంఘాల నాయకులను ఎత్తి బస్సుల్లో ఎక్కించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగానూ, అక్కడే దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా నాయకులు కృష్ణలంక పోలీసుస్టేషన్లో నిరాహారదీక్షకు చేపట్టారు. ప్రభుత్వం సరైన సమాధానం చెప్పే వరకూ ఊరుకునేది లేదని బైఠాయించారు. అంతకు ముందు కళాక్షేత్రం వద్ద నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్న జిఓను రద్దు చేయాలని కోరితే అదే జిఓను ఉపయోగించి అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. జిఓ పేరుతో ప్రతిపక్షాలు, ప్రజాస్వామిక వాదుల గళాన్ని మూసేయాలనుకుంటున్నారని విమర్శించారు. తమ సమస్యలు స్వేచ్ఛగా చెప్పుకునే హక్కును కూడా ఇవ్వడం లేదని అన్నారు. జిఓ1 విడుదల చేసిన తరువాత అధికార పార్టీకి చెందిన నాయకులు విచ్చలవిడిగా రోడ్లపై ప్రదర్శనలు చేస్తున్నారని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అడ్డుకోని పోలీసులు ప్రతిపక్ష పార్టీల కార్యక్రమాలకు అడ్డంకులు పెడుతున్నారని మండిపడ్డారు. న్యాయం కావాలని కోరుతున్న తమను బలవంతంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలు బయటకు రాకుండా ప్రజాస్వామ్య హక్కుల గొంతు నులుముతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వ చర్యలను ప్రజలు అంగీకరించబోరని అన్నారు. అసెంబ్లీకి వెళి తమ సమస్యలు

మిగతా 2లో

'వివేకా' హత్య కేసులో స్టేటస్ రిపోర్టు

- సిబిఐకి 'సుప్రీం' ఆదేశం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ఎంపి వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఘటన జరిగి నాలుగేళ్లు పూర్తయినా దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. దర్యాప్తు త్వరగా పూర్తి చేయలేకపోతే, అధికారిని మార్చాలని సూచించింది. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తుపై నిందితుడు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి భార్య తులసమ్మ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. దర్యాప్తు తాజా పరిస్థితిపై సీల్డు కవర్‌లో స్టేటస్ రిపోర్టు అందజేయాలని సిబిఐని ధర్మాసనం ఆదేశించింది. దర్యాప్తు అధికారి స్థానంలో మరొకరి నియమించొచ్చా అనే దానిపై సిబిఐ డైరెక్టరు వైఖరి తెలుసుకుని తదుపరి విచారణలో తెలపాలని దర్యాప్తు సంస్థ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్‌కు సూచించింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేసింది.

సీల్డ్ కవర్ పద్ధతికి చెక్

- ఇది సహజ న్యాయానికే విరుద్ధమన్న సుప్రీం
- కేంద్రానికి చెంపపెట్టు

న్యూఢిల్లీ : చీటికి మాటికి అనుసరించే సీల్డ్ కవర్ పద్ధతికి సుప్రీం కోర్టు చెక్‌పెట్టింది. ఒకే ర్యాంక్‌కు ఒకే పెన్షన్ (ఒఆర్‌ఒపి) కేసులో కేంద్ర ప్రభుత్వం అందజేసిన సీల్డ్ కవర్ నోట్‌ను ఆమోదించడానికి సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. "సీల్డ్ కవర్స్‌కు వ్యక్తిగతంగా నేను వ్యతిరేకిని. న్యాయస్థానంలో పారదర్శకత వుండాలి." అని భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ మరో మారు స్పష్టం చేశారు. "ఉత్తర్వులను అమలు చేయడమే ఇది, ఇందులో రహస్యం ఏముంది? సీల్డ్ కవర్ పద్ధతికి స్వస్తి చెప్పాల్సిన అవసరం వుంది. సహజమైన, సక్రమమైన న్యాయానికి సంబంధించిన మౌలిక క్రమానికి మౌలికంగా ఇది పూర్తి విరుద్ధం" అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఇదొక చెంపపెట్టు లాంటిది. మాజీ సైనికోద్యోగులకు ఒఆర్‌ఒపి బకాయిలను చెల్లించడంపై ఇండియన్ ఎక్స్ సర్వీస్‌మెన్ మూవ్‌మెంట్ (ఐఇఎస్‌ఎం) దాఖలు చేసిన పిటిషన్‌పై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ జెబి పార్దీవాలాలతో కూడిన బెంచ్ విచారించింది. ఒఆర్‌ఒపి పథకంపై 2022లో ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాల్సి వుంటుందని కోర్టు పేర్కొంది. 2024 ఫిబ్రవరి 28నాటికల్లా 10 నుంచి 11లక్షల మంది పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను మూడు సమాన వాయిదాల్లో చెల్లించాలని కోరింది. ఒఆర్‌ఒపి విషయంలో ఇంతకుముందు కూడా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని మందలించింది. ఒఆర్‌ఒపి పథకం కింద చెల్లించాల్సిన కచ్చితమైన ఎరియర్ల మొత్తాన్ని ప్రకటిస్తూ˚క నోట్‌ను దాఖలు చేయాల్సిందిగా రక్షణ మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. పెన్షన్ కోసం వేచిచూస్తూ ఇప్పటికే నాలుగు లక్షల మందికి పైగా రిటైరయిన రక్షణ సిబ్బంది మరణించడం విచారకరమని పేర్కొంది.

" సీల్డ్ కవర్ బిజినెస్‌కు స్వస్తి చెప్పాలని మేం భావిస్తున్నాం. సుప్రీం కోర్టు దీన్ని అనుసరిస్తే, హైకోర్టులు కూడా అదే అనుసరిస్తాయి." అని చంద్రచూడ్ అటార్నీ జనరల్‌కు చెప్పారు. మాజీ సైనికోద్యోగుల తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది హుఫిజీ అహ్మదితో ఆ నోట్ వివరాలను పంచుకోవాల్సిందిగా అటార్నీ జనరల్‌ను కోరారు. ఎవరి ప్రాణానికైనా ముప్పు వుందనుకున్నప్పుడు, అత్యాచార కేసుల్లో బాధితుల గుర్తింపును రహస్యంగా

మిగతా 2లో

ఇదో పెద్ద స్కామ్

- స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.371 కోట్లు స్వాహా : అసెంబ్లీలో సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి హయాంలో అప్పటి సిఎం చంద్రబాబు, ఆయన మనుషులు కలిసి నిరుద్యోగులకు శిక్షణ పేరుతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నకిలీ కంపెనీలు సృష్టించి రూ.371 కోట్లు స్వాహా చేశారని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో సోమవారం మధ్యాహ్నం స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్ పై చర్చ జరిగింది. మాజీ మంత్రి కె.కన్నబాబు, మంత్రి గుడివాడ అమరనాథ్ ప్రసంగించిన తరువాత జగన్ దాదాపు 45 నిమిషాలు ఈ అంశంపై మాట్లాడారు దేశంలోనే ఈ స్కామ్ అతిపెద్దదని అన్నారు. యువతకు శిక్షణ పేరుతో రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా మళ్లించారని అన్నారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండు నెలలకు జరిగిన కేబినెట్ భేటీలో చెప్పిందొకటి... ఆదేశాలు ఇచ్చిందొకటి... ఈ స్కామ్ రాష్ట్రం నుంచి వివిధ రాష్ట్రాల ద్వారా ఇతర దేశాలకు పాకిందన్నారు. డిపిఆర్, టెండర్ల ప్రక్రియ లేకుండానే లోపాయికారి ఒప్పందంతో దోపిడీ చేశారని అన్నారు. సీమెన్స్ అనే ప్రైవేటు సంస్థ రూ. 3 వేల కోట్లు ఇస్తుందని ప్రచారం చేశారని ఆరోపించారు. ఆరు క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని జివోలో చెప్పారని ఒక క్లస్టర్‌కు రూ.546 కోట్లు ఖర్చు చేస్తామని, మిగిలిన



రూ.3వేలు కోట్లు సీమెన్స్ సంస్థ ఇస్తుందని జివోలో తెలిపారని జగన్ చెప్పారు. 90 శాతం సీమెన్స్ ఇస్తే 10 శాతం ప్రభుత్వం భరించేలా నిర్ణయించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు మొత్తం రూ.3356 కోట్లని ఇందులో ప్రభుత్వ వాటా 10 శాతం కాగా, సీమెన్స్, డిజైన్ టెక్ 90 శాతం భరిస్తుందన్నారు. 10 శాతం అంటే రూ.371 కోట్లు ప్రభుత్వం మూడు దఫాలుగా విడుదల చేశారని చంద్రబాబు పాత్రతోనే స్కామ్ జరిగిందన్నారు. షెల్ కంపెనీల ద్వారా జరిగిన మనీ లాండరింగ్‌పై ఈడి దృష్టి సారించిందన్నారు. చంద్రబాబు సిఎంగా రాసిన ఫైల్ మాయం చేశారని, సిఎం ఆదేశాలతో అప్పటి అధికారులు రాసిన నోట్ ఫైల్‌ను అసెంబ్లీలో ప్రదర్శించారు. సిమెన్స్ ఇండస్ట్రీ మాజీ ఎండీ వికాస్ వినాయక్ కన్వేల్కర్, ఎక్స్ ఫైనాన్షియల్ అడ్వైజర్ ముకుల్ చంద్ర అగర్వాల్‌ను, ఆథరైజ్డ్ సిగ్నటరీ ఆఫ్ స్కిల్లార్ ఎంటర్ ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ సురేష్ గోయల్‌ను అరెస్టు చేసి వాళ్లను పిఎంఎల్‌ఏ కోర్టులో ప్రవేశపెట్టి, 7 రోజుల పాటు ఈడీ కస్టడీకి తీసుకుందని సిఎం వివరించారు.

పుతిన్, జిన్‌పింగ్ భేటీ

- ద్వైపాక్షిక, ఆర్థిక సంబంధాల విస్తరణే లక్ష్యం

లోపలి పేజీలో..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీ

- 23 నుండి 27 వరకు వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్
- ఎపివివి కమిషనర్ వినోద్‌కుమార్

లోపలి పేజీలో..

దాడి చేసిన వారిని అసెంబ్లీలో అడుగుపెట్టనీయం

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ఎమ్మెల్యేపై దాడిచేసిన వారిని మరలా అసెంబ్లీలో అడుగుపెట్టనీయబోమని, ప్రజల మద్దతుతో బుద్ధి చెబుతామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామిపై దాడి చేయడంపై బాధపడుతున్నానని, దారుణమని అన్నారు. టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పట్టభద్ర ఎన్నికల్లో గెలిచిన టిడిపి అభ్యర్థులు చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, రామ్‌గోపాల్‌రెడ్డి చంద్రబాబును కలిశారు. వారిని అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. కోడికత్తి డ్రామా, బాబాయి హత్యడ్రామాల్లాగా వారే దాడిచేసి డ్రామాలు ఆడతారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి వైపు వీచింది చిన్నగాలే అని, రాబోయే సునామీతో వైసిపి, జగన్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. అసెంబ్లీ గౌరవసభ కాదని, కౌరవ సభ అని ఏనాడో చెప్పానని తెలిపారు. దళిత ఎమ్మెల్యేపై దాడిచేసి అతనికి కనీసం క్షమాపణ కూడా చెప్పరా అని ప్రశ్నించారు. సభలో పొరపాటు చేస్తే అక్కడుండే పెద్దలు ఇరుపక్షాలతో మాట్లాడి సర్దుబాటు చేస్తారని తెలిపారు. గతంలో పుచ్చలపల్లి సుందరయ్య వంటి వారు సభలో కఠినంగా మాట్లాడేవారని అయినా స్పీకర్ తన హుందాతనాన్ని కోల్పోలేదని గుర్తుచేశారు. సభలో జరిగిన సంఘటన ఒక చీకటి ఘట్టంగా, చీకటిరోజుగా మిగిలిపోతుందన్నారు. ఎమ్మెల్యే స్వామిపై దాడి చేయడమే కాకుండా తిరిగి తమ పార్టీ ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. జివో 1 రద్దయ్యేవరకు పోరాడతామని, స్వామి పోరాటం వృథా కాదని అన్నారు. స్వయంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేలపై దాడి జరుగుతుంటే, లా అండ్ ఆర్డర్ ఎక్కడ ఉన్నట్టు అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీ

- 23 నుండి 27 వరకు వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్, సర్జన్, స్పెషలిస్టు పోస్టులను శాశ్వత, కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు ఈ నెల 23 నుండి 27 వరకు వాక్ ఇన్ రిక్రూట్మెంట్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఎపివివి) కమిషనర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపివివి ఆధ్వర్యంలో విజయవాడ హనుమాన్ పేట పాతగవర్నమెంట్ ఆసుపత్రిలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో వాకిన్ రిక్రూట్మెంట్ నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 23న జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, డెర్మటాలజీ స్పెషాలిటీలకు, 25న గైనకాలజీ, ఇఎన్‌టి, అనస్తీషియా, పాథాలజీ స్పెషాలిటీలకు, 27న పిడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, ఆప్తాల్మాలజీ, రేడియోలజీ, సైక్రియాట్రీ స్పెషాలిటీకు వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆయా తేదీల్లో సూచించబడిన ధ్రువపత్రాలతో వ్యక్తిగతంగా హాజరు కావాలని కోరారు. ఎస్ఎస్‌సి, ఎం.బి.బి.ఎస్, పిజి డిగ్రీ, లేదా డిప్లొమా సర్టిఫికెట్స్, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పిజి మార్కుల లిస్టు, సోషల్ స్టేటస్ సర్టిఫికెట్, నాలుగో తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు. ఏదైనా ఇతర సమాచారాన్ని 6301138782కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

శాసనసభను రణసభగా మార్చొద్దు : బిజెపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభను రణసభగా మార్చవద్దని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం శాసనసభలో జరిగిన సంఘటనలు ప్రజాస్వామ్య వాదులను బాధపెడుతుందని తెలిపారు. చట్టసభల్లో చర్చలు జరిగినప్పుడే సభకు హుందాతనం లభిస్తుందన్నారు. ఇందుకు భిన్నంగా సభ్యుల మధ్య తోపులాటలు జరిగితే ప్రజలకు చట్టసభలంటే ఏమి సందేశం ఇస్తున్నారని సోము వీర్రాజు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

సీల్డ్ కవర్ పద్ధతికి చెక్

(మొదటిపేజీ తరువాయి)

ఉంచాలనుకున్నప్పుడు ఇటువంటి అరుదైన సందర్భాల్లో మాత్రమే ఈ సీల్డ్ కవర్ పద్ధతిని అనుసరించాలని చంద్రచూడ్ అన్నారు. కానీ, ప్రభుత్వాలు ప్రజలకు అందజేయాల్సిన సమాచారంపై ఎలాంటి నిశిత పరిశీలన లేకుండా తప్పించుకునేందుకు గత కొన్నేళ్లుగా సీల్డ్ కవర్ రూటును ఎంచుకుంటున్నాయి. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు కొందరు ఏ ఒత్తిళ్ల ఫలితమో కానీ ఈ సీల్డు కవర్ల సంస్కృతిని అనుమతిస్తూ వచ్చారు. రాఫెల్ ఒప్పందానికి సవాళ్లు ఎదురైనప్పుడు, అస్సాంకు చెందిన పౌరసత్వ నమోదు వ్యవహారం, అయోధ్య వివాదం, గుజరాత్ పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్ కేసు, నరేంద్ర మోడీ బయోపిక్ వివాదం వంటి కేసుల్లోను, అప్పటి సుప్రీం ప్రధాన న్యాయమూర్తి రంజన్ గగోయ్‌కి సంబంధించిన లైంగిక వేధింపుల కేసు, బీమా కొరెగావ్ కేసు, కాంగ్రెస్ నేత పి.చిదంబరానికి ముందస్తు బెయిల్ వంటి ముఖ్యమైన కేసుల్లో ప్రభుత్వం అందజేసిన సీల్డ్ కవర్లను కోర్టు అనుమతించింది. గతంలో సర్వీసు లేదా అడ్మినిస్ట్రేటివ్ కేసుల్లో మాత్రమే ఈ సీల్డ్ కవర్ పద్ధతి వుండేది. తరువాత అన్నిటికీ విస్తరించింది. ఈ సీల్డ్ కవర్ పద్ధతి ప్రమాదకరమైన ధోరణి అని గతేడాది అక్టోబరు 20న ఇచ్చిన తీర్పులో జస్టిస్ చంద్రచూడ్ స్పష్టంగా చెప్పారు.

717 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

- 6,755 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- మండలిలో మంత్రి బొత్స సమాధానం
- తప్పుడు సమాచారం చెప్పారన్న పిడిఎఫ్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 717 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. 2019 నుంచి 14,219 మంది ఉపాధ్యాయ నియామకాలు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 6,755 ఉన్నాయని చెప్పారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సందర్భంగా ఉపాధ్యాయ ఖాళీ పోస్టులు, కొత్త డిఎస్‌సి వివరాలు చెప్పాలని టిడిపి సభ్యులు అడిగిన ప్రశ్నపైనా, ఏకోపాధ్యాయ పాఠశాలల గురించి స్వతంత్ర ఎమ్మెల్సీ పి రఘువర్మ అడిగిన ప్రశ్నపైనా సోమవారం చర్చ జరిగింది. 2018లో ఎంపికైన 7,254 మందికి, 2008లో ఎంపికైన 1910 మందికి, 2019 ప్రత్యేక డిఎస్‌సి ద్వారా 521 మందిని నియమించామని చెప్పారు. ప్రస్తుతం 5251 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిలో 4534 మంది డిఎస్‌సి-1998 అభ్యర్థులకు త్వరలో నియమకాలు అందిస్తే ఇక మిగిలేది 717 ఉపాధ్యాయ పోస్టులే అని చెప్పారు. ఉపాధ్యాయ ఖాళీల గురించి ప్రస్తావించని మంత్రి గత డిఎస్‌సిల్లో మిగిలిన పోస్టులకు తాము నియామకాలు ఇచ్చామని చెప్పారు. మంత్రి చెప్పిన సమాధానంపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి బాలసుబ్రహ్మణ్యం, కెఎస్ లక్ష్మణరావు, షేక్ సాబ్జీ, ఐ వెంకటేశ్వరరావు, స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. వేసిన ప్రశ్నకు చెప్పిన సమాధానానికి పొంతన లేదని, అదేవిధంగా ఉపాధ్యాయ ఖాళీ పోస్టులపై తప్పుడు సమాచారం అందించారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఇడి, డిఇడి చేసిన నిరుద్యోగులు డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సుమారు 50,677 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ కేంద్రానికి ఇచ్చిన సమాచారం కరోనాకు ముందని తెలిపారు. తాము పాటిస్తున్న మార్గదర్శకాల ప్రకారం 717 పోస్టులే ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. పిడిఎఫ్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం జివో 117 తీసుకొచ్చి టీచర్ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలకు తరలించిందని, రేషనలైజేషన్ పేరుతో పోస్టులను కుదించిందని, రెండు మాధ్యమాలను ఒక మాధ్యమానికే కుదించిందని మండిపడ్డారు. తరగతి గదిలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు ఉపాధ్యాయులకు అదనపు పీరియడ్లు అప్పగించి వారిపై అదనపు భారం మోపుతుందన్నారు. కొత్తగా టీచర్లు అవసరం లేదన్నట్లుగా ప్రభుత్వం చెబుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని చెబుతున్న ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని పిడిఎఫ్ సభ్యులతో పాటు బిజెపి సభ్యులు వాకాటి నారాయణ రెడ్డి ప్రశ్నించారు. ఏకోపాధ్యాయ పాఠశాలలపై కూడా మంత్రి చెప్పిన సమాధానంపై పిడిఎఫ్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 2021-22 యుడైస్ లెక్కల ప్రకారం 12,386 పాఠశాలలు ఉన్నాయని సభ్యులు చెప్పారు. ఉపాధ్యాయులు లేక ప్రాథమిక విద్య చాలా ఇబ్బంది పడుతోందన్నారు. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు కాకుండా అవసరమైన టీచర్లతో నడపగలమని మంత్రి చెప్పగలుగుతారా అని ప్రశ్నించారు.



ఉత్తరాంధ్ర సుజల స్రవంతి డిజైన్ మార్చాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాబు జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి (పోలవరం ఎడమ కాలువ) డిజైన్‌ను మార్చాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబుకు విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. భూబాధితుల పోరాట కమిటీ నాయకులు బిఎ నాయుడు, జెవిఎస్ఎన్ రాజుతో కలసి వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కింద విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో 3.94 లక్షల ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టు డిజైన్‌ను మారిస్తే ఆయకట్టు అభివృద్ధిలోకి రావడంతోపాటు తాగునీటి సమస్య, పారిశ్రామిక అవసరాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. తోటపల్లి ప్రాజెక్టు కుడికాలువ, గజపతి నగరం బ్రాంచి కెనాల్, తారకరామ ప్రాజెక్టు, తాటిపూడి ప్రాజెక్టు కింద స్థిరీకరించిన ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించేలా డిజైన్‌లో మార్పులు చేయాలని కోరారు.

అంగన్‌వాడీల అరెస్టులు అన్యాయం

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కనీస వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ కార్యాలయం సోమవారం ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయడానికి సోమవారం రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి విజయవాడకు చేరుకున్న అంగన్‌వాడీలను రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లు, ఇతరచోట్ల ఎక్కడికక్కడ అటకాయించి 1500 మందిని అరెస్టు చేయడం అన్యాయమని తెలిపింది. మహిళలన్న విచక్షణ లేకుండా పోలీసులు రోడ్లపై పడవేసి ఈడ్చుకెళ్లారని వివరించింది. అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిందిపోయి వారిపై దౌర్జన్యంగా వ్యవహరించడం గర్హనీయమని పేర్కొంది. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్రప్రభుత్వం ఆ యూనియన్‌తో చర్చించి పరిష్కరించాలని, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది.

ప్రభుత్వ తీరు దుర్మార్గం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వచ్చిన అంగన్‌వాడీలపై ప్రభుత్వం అనుసరించిన తీరు దుర్మార్గమని ప్రజలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు మనుగడ సాగించలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న ప్రభుత్వం బుద్ధితెచ్చుకోకపోగా ఇంకా దుందుడుకు చర్యలకు దిగడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. వెంటనే అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని కోరారు.

శాసనసభలో చర్చలు లేకుండా దాడులేమిటి ? : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభలో అర్థవంతమైన చర్చలు లేకుండా దాడులేమిటని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. ప్రజల గొంతు నొక్కే జిఓనెంబరు1పై చర్చను కోరిన టిడిపి సభ్యులపై అధికారపక్షం దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టసభల గౌరవాన్ని హుందాత నాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత సభానాయకుడు, స్పీకర్‌పై ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు డోల బాల వీరాంజనేయస్వామి, గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై దాడిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు.

ఈడ్చేశారు

(మొదటిపేజీ తరువాయి)

రోడ్లలో పోలీసులు అడ్డుకున్నారు. బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న సాధారణ మహిళలను సైతం తనిఖీలు నిర్వహించారు. బస్సుల్లో, రైళ్లలో దిగిన వారిని దిగినట్లుగానే వాహనాల్లో ఎక్కించి నగరంలో పలు స్టేషన్లకు తరలించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లకు వచ్చిన సాధారణ మహిళల నుంచి సైతం మహిళా పోలీసులు ఫోన్‌లు లాక్కున్నారు. అంగన్‌వాడీలు కాదని నిర్ధారించుకున్న తర్వాత వారిని అక్కడ నుంచి పంపారు.

విజయవాడలో వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 3000 మందికిపైగా అంగన్‌వాడీలను అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. పోలీసు స్టేషన్లన్నీ మహిళలతో నిండిపోయాయి. తమ స్టేషన్లకు పంపొద్దని ఎస్‌హెచ్‌ఒలు మొరపెట్టుకున్నారు. అయినా ఇంకా మహిళలు వస్తూనే ఉన్నారు. పోలీసులు అన్ని జిల్లాల్లో ఎన్ని అడ్డంకులు సృష్టించినా వేలాదిగా తరలివచ్చారు. ఉదయం 10 గంటల సమయంలో ఒక్కసారిగా లెనిన్ సెంటర్ సమీపంలో వేర్వేరు ప్రాంతాల నుండి ఏలూరు రోడ్డుపైకి వందలాది మంది వచ్చి చేరారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావును అక్కడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లెనిన్ సెంటర్లో రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబూరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె ఉమామహేశ్వరరావు, కె ధనలక్ష్మిని పోలీసులు అరెస్టు చేశారు. నాయకులను అరెస్టు చేసే క్రమంలో తీవ్ర తోపులాట జరిగింది. అరెస్టులను అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. ఒకవైపు అరెస్టులు జరుగుతుండగానే వందలాది మంది మహిళలు దఫదఫాలుగా రోడ్డుపైకి వచ్చారు. వారిని అరెస్టు చేసే క్రమంలో పలువురు మహిళలు రోడ్డుపై పడిపోయారు. అనంతపురానికి చెందిన కమల సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెకు తోటి మహిళలు సపర్యలు చేశారు. పోలీసులు కొట్టడం వల్లే ఇలా జరిగిందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో అంగన్‌వాడీ టీచర్ బుజ్జికి గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించారు. దుర్గాపురంలో ఎవి నాగేశ్వరరావు, పడవల రేవు సెంటర్లో ఆర్‌వి నరసింహారావు, బేబీరాణి అరెస్టయ్యారు.

సొమ్మసిల్లిన మహిళలు

పోలీసులు నెట్టివేయడంతో అనంతపురం అర్బన్ నవోదయ కాలనీకి చెందిన అంగన్‌వాడీ టీచర్ జి కమల సొమ్మసిల్లి పడిపోయారు. ఈ క్రమంలోనే కంకిపాడుకు చెందిన అంగన్‌వాడీ ఆయా కోట కుమారి రోడ్డుపై పడిపోయారు. పోలీసుల అరెస్టుల నేపథ్యంలో ఒత్తిడికి గురైన ఓ అంగన్‌వాడీ కార్యకర్త గుండెపోటుకు గురయ్యారు. ఆమెను హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలని కోరితే అరెస్టులా?

సిఐటియు ప్రధాన కార్యదర్శి నరసింగరావు

ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరితే అరెస్టు చేయడం ఏమిటని సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు ప్రశ్నించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు తెలంగాణలో కంటే ఒక వెయ్యి రూపాయలు ఎక్కువ జీతం ఇస్తామని ప్రతిపక్షంలో ఉండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీనిచ్చారని, ఇప్పటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోగా అడిగితే పోలీసులతో అరెస్టులు చేయించడం ఏం న్యాయమని అన్నారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, తీవ్రరూపం దాలుస్తుందని పేర్కొన్నారు. గతంలో అంగన్‌వాడీలతో పెట్టుకున్న ప్రభుత్వాలన్నీ అధికారం కోల్పోయాయని, జగన్ కూడా ఆ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు.

సిఎం తీరు అప్రజాస్వామికం

కె సుబ్బరావమ్మ

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి కె సుబ్బరావమ్మ అన్నారు. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నామని తెలిపారు. దీనిపై ఇంత నిర్బంధం ప్రయోగించడం ఏమిటని అన్నారు. అర్ధరాత్రని చూడకుండా ఇళ్లల్లోకి చొరబడి నాయకులను పోలీసులు అరెస్టు చేశారని, సెల్‌ఫోన్లను లాక్కున్నారని తెలిపారు.

దాడిచేసి దొంగ ఏడుపులు

- వైసిపిపై టిడిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ఎమ్మెల్యేలు తమపై దాడిచేసి దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని టిడిపి ఎమ్మెల్యేలు అన్నారు. ప్రజలు, ప్రతిపక్షాల స్వేచ్ఛను కాలరాస్తున్న జిఒ 1పై సభలో మాట్లాడకూడదా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ప్రాంగణం వద్ద సోమవారం విలేకరులతో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తమ ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేస్తూ స్పీకర్‌కు కనిపించేలా ప్రదర్శించారని తెలిపారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ధర్నా చేస్తున్నామని వెల్లడించారు. ఒక్కసారిగా వైసిపి ఎమ్మెల్యేలు వచ్చి తమపై దాడికి యత్నించారని, ఇష్టానుసారం బూతులు తిడుతూ వీరాంజనేయస్వామిని కొట్టారని వివరించారు. తప్పు అని చెప్పిన తమ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ దాడి చేశారని తెలిపారు. తమ సీట్లలో కూర్చున్న తరువాత కూడా వెలంపల్లి, డిప్యూటీ సిఎం నారాయణ స్వామి, మంత్రి కారుమూరి తమపై దాడికి వచ్చారని తెలిపారు. ఇంత జరుగుతున్నా స్పీకర్ బెల్లంకొట్టిన రాయిలా కిమ్మనకుండా కూర్చున్నారని విమర్శించారు. సభ వీడియో విజువల్స్‌ను బయటపెడితే ఎవరిది తప్పో ప్రజలకు కూడా తెలుస్తుందన్నారు. తమ ఎమ్మెల్యేలు నిజంగా తప్పుచేశారని, స్పీకర్‌ను ముట్టుకున్నారని తేలితే ఏ చర్యలు తీసుకున్నా సిద్ధమేనని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి మూడు స్థానాలు గెలిచి జగన్ కోటను కూడా బద్దలు కొట్టిందన్న అక్కసుతోనే వైసిపి కిరాయి ఎమ్మెల్యేలు సభలో దాడి చేశారని విమర్శించారు. వైసిపి ఎమ్మెల్యేలపై స్పీకర్ సుమోటోగా కేసు నమోదు చేయించి అరెస్ట్ చేయించాలని డిమాండ్ చేశారు. మంత్రి కారుమూరి తనను తోస్తే కిందపడకుండా తమ ఎమ్మెల్యేలు పట్టుకున్నారని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు.

ఒక్కో అభ్యర్థికి 22 ఓట్లు

- ఎమ్మెల్సీ ఎన్నికల మాక్‌పోలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసన మండలిలో ఎమ్మెల్యేల కోటాలో ఏడుగురు అభ్యర్థులను గెలిపించేందుకు వైసిపి తలపెట్టిన వ్యూహరచనలో భాగంగా సోమవారం శాసనసభ మందిరంలో మాక్ పోలింగ్ జరిగింది. ఏడుగురు అభ్యర్థులకు గాను ఒక్కో అభ్యర్థికి 22 మంది ఓటు వేసేలా బ్యాలెట్‌లను రూపొందించారు. ఏడుగురు అభ్యర్థుల పేర్లతో పాటు వారి ఫొటోలను కూడా ముద్రించారు. ప్రతి ఎమ్మెల్యే ఒకటి నుంచి నలుగురికి ప్రాధాన్యత ఓటు వేసేలా నిర్దేశించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ స్పీకర్ కోలుగట్ల వీరభద్రస్వామి, చీఫ్ విప్ ప్రసాదరాజుతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు వారికి కేటాయించిన అభ్యర్థులకు ఒకటి, రెండు. మూడు, నాలుగు ప్రాధాన్యతల ఓటు వేశారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎల్. అప్పిరెడ్డి మాక్ పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం తప్పనిసరిగా 151 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరు కావాలని పార్టీ నాయకత్వం సమాచారం పంపినా, 20 మంది గైర్హాజరయ్యారు. వైసిపికి చెందిన 130 మంది, టిడిపి నుంచి గెలిచి వైసిపికి మద్దతు ఇస్తున్న మద్దాలి గిరి, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేష్ మాక్ పోలింగ్‌కు హాజరయ్యారు. సిఎం జగన్ మాక్ పోలింగ్‌లో పాల్గొనలేదు. నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు పోలింగ్‌కు దూరంగా ఉంటారనే ప్రచారం జరుగుతోంది. టిడిపి ఎమ్మెల్యేలు 19 మంది మాత్రమే ఉన్నారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు రాజీనామా ఆమోదిస్తే వీరిసంఖ్య 18కి తగ్గుతుందని వైసిపికి ఇబ్బంది ఉండదని కొంతమంది స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ అంశంపై న్యాయపరమైన చిక్కులను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

బాహాబాహీ

(మొదటిపేజీ తరువాయి)

చరణ్, సామినేని ఉదయభాను, విడదల రజిని, డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎలీజా, సీదిరి అప్పలరాజు, పినిపే విశ్వరూప్, చెల్లబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. టిడిపి సభ్యుల తీరును తప్పుపట్టారు.

గీత దాటితే వేటే : స్పీకర్ రూలింగ్

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా టిడిపి సభ్యుల ప్రవర్తన సక్రమంగా లేదని, ముఖ్యంగా టిడిపి సభ్యులు డోలా బాలవీరాంజనేయస్వామి ప్రతిరోజూ తీవ్ర స్థాయిలో ధూషిస్తున్నారని స్పీకరు తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. వారి ప్రవర్తన ఆక్షేపణీయమని, హేయం, గర్హనీయమని, సభ్యులు మితిమీరి ప్లకార్డును తన ముఖంపై పెట్టారని, ఛైర్‌మీదకు వచ్చారని, స్పీకరు ఛైర్‌ను అవమానపరిచారని పేర్కొన్నారు. ముఖం మీద ప్లకార్డులు పెట్టడంతో సభ కూడా తనకు కనిపించడం లేదని, నేను అలా చేయవద్దంటే చేయి చేసుకున్నట్లు అనుకోవాలా ? నేను నిజంగా అలా చేసి ఉంటే వారం రోజుల నుంచి సహిస్తూ ఉంటానా ? ఇన్ని రోజులు భరిస్తానా ? అని స్పీకర్ ప్రశ్నించారు. రూలింగ్ ప్రకారం సభ్యులు ఎవరైనా వెల్‌లోకి రావడం, స్పీకరుపై వ్యాఖ్యలు చేయడం చేస్తే ఆటోమెటిక్‌గా మూడు సిటింగ్‌లు లేదా మొత్తం సమయానికి సస్పెండ్ చేయాలని తెలిపారు. ఆ హక్కు సభకు ఉంటుందని, వరుసగా ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడితే ఐదు సిటింగ్‌ల వరకూ సస్పెండ్ చేయవచ్చని అన్నారు.

తుళ్లూరు పిఎస్‌లో టిడిపి ఫిర్యాదు

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జిఒ నెంబరు1పై చర్చించాలని పట్టుబట్టిన తమపై వైసిపి ఎమ్మెల్యేలు భౌతికంగా దాడులు చేశారంటూ ప్రకాశం జిల్లా కొండెపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి సోమవారం సాయంత్రం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి సంబంధించి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎలీజాపై ఫిర్యాదు చేశారు.

సిఎంను కలిసిన వైసిపి ఎమ్మెల్యేలు

శాసనసభలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైసిపి ఎమ్మెల్యేలు కలిశారు. సభలో ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టిడిపి ఎమ్మెల్యేలు దాడి చేశారంటూ సంఘటన గురించి వివరించారు. సుధాకర్‌బాబు మోచేయి గాయం అయిందని, చేయి వాచిందని తెలిపారు. సిఎంను కలిసిన వారిలో హోంశాఖ మంత్రి తానేటి వనిత, రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తదితరులు ఉన్నారు.

దళితజాతి, సమాజంపై దాడి : సుధాకర్‌బాబు

తనపై జరిగిన దాడి దళితజాతి, దళిత సమాజంపై జరిగిన దాడని సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి దాడుల గురించి ప్రజలకు తెలియజేస్తామన్నారు. తనపై భౌతిక దాడులు జరిగే అవకాశాలున్నాయని, తనకు రక్షణ కల్పించాలని సుధాకర్‌బాబు స్పీకరుకు విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ సమస్యలపై చర్చించాలి

- మండలిలో పిడిఎఫ్ వాయిదా తీర్మానం
- సమావేశాలు అడవిలో పెట్టుకోవాలా : విబిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ సమస్యలపై చర్చించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో పట్టుబట్టారు. సోమవారం సభ ప్రారంభమైన వెంటనే అంగన్‌వాడీలపై ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని కోరారు. దీనికి ఛైర్మన్ తిరస్కరించడంతో సభ్యులు వారి సీట్లలో నుండి లేచి ముందుకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. చర్చ జరపాలని పట్టుబట్టారు. ఏళ్ల తరబడి కనీస వేతనాలకు నోచని అంగన్‌వాడీ సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్బంధ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న పరిస్థితిని చూస్తే ప్రజాస్వామ్యంలోనే వున్నామా? అనే అనుమానం కలిగేలా ఉందని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో పోతోందన్నారు. మహారాష్ట్రలో, యుపిలో వేలాదిమంది ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లమీదకు వచ్చి నిరసనలు చేస్తుంటే రాష్ట్రంలో నాలుగు వందలు, ఐదు వందల మంది కలిసి నిరసనలు తెలిపినా రాష్ట్రప్రభుత్వం సహించలేకపోతోందని విమర్శించారు. నిరసనలకు దిగితే అరెస్టు చేయడం తగదని అన్నారు. విజయవాడకు 25 కిలోమీటర్ల దూరంలో అంగన్వాడీ టీచర్లు నిరసన కార్యక్రమం పెట్టుకుంటే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు తమ సమస్యలను ఎక్కడ చెప్పుకోవాలో ప్రభుత్వం చెప్పాలన్నారు. అడవిలో స్థలం చూపినా అక్కడ నుండి అయినా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా నిరసన కార్యక్రమాలను పెట్టుకుంటామని అన్నారు. నిరసనలు అడ్డుకోవడం సరైంది కాదన్నారు. ఈ సభలో అంగన్‌వాడీల సమస్యలను చర్చించాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు జోక్యం చేసుకుని చర్చకు వాయిదా తీర్మానంలో ఇవ్వడం కుదరదని, మరో ఫార్మాట్‌లో వస్తే చర్చకు అనుమతిస్తామని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా చర్చకు ప్రభుత్వం సుముఖంగా ఉందని హామీ ఇవ్వడంతో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తమ స్థానాల్లోకి వెళ్లారు.

సమగ్ర సర్వేలో తప్పులుంటే సివిల్ కోర్టుకు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపట్టిందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. సోమవారం శాసనమండలిలో సమగ్ర సర్వేలో వస్తున్న సమస్యలను ఎమ్మెల్సీలు ప్రస్తావించగా.. మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పందిస్తూ.. బ్రిటీష్‌నాటి సర్వేనే ఇప్పటికీ ప్రామాణికంగా ఉందన్నారు. అప్పుడు చేసిన సర్వే తర్వాత భూముల యజమాన్యం విషయంలో కొన్ని తరాలు మారాయని అన్నారు. మధ్యలో కొన్ని ప్రభుత్వాలు సర్వే చేసినా శాశ్వత పరిష్కారాన్ని చూపలేకపోయాయని పేర్కొన్నారు. రికార్డులకు, క్షేత్రస్థాయికి చాలా తేడాలుండటంతో అత్యాధునిక సర్వే యంత్రాలతో భూసమగ్ర సర్వే చేస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఈ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. సర్వేలో తమకు అన్యాయం జరిగిందని, సరిగ్గా చేయలేదని అనుకుంటే డిప్యూటీ తహశీల్దారుకు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. అక్కడ సంతృప్తికరమైన నిర్ణయం రాకపోతే సివిల్ కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమగ్ర భూ సర్వే జయప్రదం కావాలంటే ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

జిఓ 1ని రద్దు చేయాలి

- టిడిపి వాయిదా తీర్మానం
- తిరస్కరించడంతో వాకౌట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా నిరసనలు తెలుపుకునేందుకు అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నెంబర్ 1ని రద్దు చేయాలని శాసనమండలిలో టిడిపి సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం శాసనమండలి సమావేశం ప్రారంభం కాగానే జిఓ 1పై చర్చకు టిడిపి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు తిరస్కరించారు. చర్చ జరగాల్సిందేనంటూ టిడిపి సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. జిఓ 1ని రద్దు చేయాలని డిమాండ్ చూస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో పోతోందని ఎమ్మెల్సీలు ఎన్ఎండి ఫరూక్, అంగర రామ్మోహన్‌రావు, దీపక్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో జిఓ 1 కేవలం ప్రతిపక్షాలకు మాత్రమేనని అధికార పార్టీకి లేదని అన్నారు. టిడిపి ఎమ్మెల్సీలకు మద్దతుగా పిడిఎఫ్, బిజెపి ఎమ్మెల్సీలు నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడటం కూడా నేరమనే పద్ధతిలో సభలు, సమావేశాలు కూడా పెట్టుకోకుండా ప్రభుత్వం ఈ జిఓను తెచ్చిందని, తక్షణమే రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. మండలి ఛైర్మన్ తీరు పట్ల టిడిపి ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు.

పోలవరం భూసేకరణకు రూ.5,455 కోట్లు ఖర్చు

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకూ రూ.13,077 కోట్లు కేటాయించామని, వీటిల్లో రూ.5,455 కోట్లను ఖర్చు చేశామని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. సోమవారం శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు మొత్తం 1,13,119 ఎకరాల భూమిని సేకరించామని తెలిపారు. దీనికి సంబంధించి రూ 13,077 కోట్లను విడుదల చేసి రూ.5455.41 కోట్లను ఖర్చు చేశామని పేర్కొన్నారు. దేవీపట్నం మండలం చినరమణయ్యపేట శివార్లలో జరిగిన భూసేకరణలో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. అనర్హులైన ఏడుగురు 29.94 ఎకరాల భూమికి సంబంధించి రూ 2.24 కోట్లను అక్రమంగా కాజేసినట్లు గుర్తించామని తెలిపారు. ఈ అవకతవకలకు పాల్పడ్డ వారందరిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని 41.15 మీటర్లకే పరిమితం చేస్తున్నారని దుష్ప్రచారం చేయడం సరైందికాదని తెలిపారు. పోలవరం నిర్మాణంలో భూసేకరణ వ్యయం ఎక్కువగా వున్నందున రెండు దశల్లో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రెండు దశల్లో కలిపి మొత్తం 45.72 మీటర్ల ఎత్తు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

చలో అసెంబ్లీ ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పుకుంటామంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు ఆ మాత్రం వినలేరా అని అన్నారు. అధికారపక్ష సభ్యులు ప్రజా సమస్యలపై చర్చించకుండా రౌడీచర్యలకు దిగడం ఏ మాత్రమూ సరైనచర్య కాదని పేర్కొన్నారు. ప్రజాగళాన్ని అణగదొక్కడం ఎవరితరమూ కాదని అన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజలు ఘోరీకట్టారని అన్నారు. అక్రమ పద్ధతుల్లో ఉద్యమాలను అణచివేయాలని చూస్తే ఊరుకునేది లేదని తెలిపారు. ప్రభుత్వ విధానాలపై బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు యువజన విద్యార్థి, మహిళలు, లాయర్లు అందరూ రోడ్లపైకి వచ్చారని తెలిపారు. ప్రభుత్వ తీరుపై తిరగబడ్డారని తెలిపారు. నిరంకుశత్వాన్ని సహించేది లేదని అన్నారు. అసెంబ్లీలోనూ ఎమ్మెల్యేలను కొడుతున్నారని, ఎమ్మెల్యేలకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని, ప్రశ్నించిన వారందరిపై వేధింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. ఇస్తానన్న హామీలు అమలు చేయలేదని పేర్కొన్నారు. అంగన్‌వాడీలు, కాటికాపరులు అందరూ నేడు రోడ్లపైకి వచ్చారని, సమస్యలు పరిష్కరించాల్సిందిపోయి దౌర్జన్యపూరిత చర్యలకు దిగడం ఏ మాత్రమూ సరైంది కాదని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో సిపిఐ కార్యదర్శివర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, దోనేపూడి శంకర్, సిపిఐ(యం.యల్) నగర అధ్యక్షులు రామకృష్ణ, యువజన విద్యార్థి సంఘాల నాయకులు రాము, ప్రసన్నకుమార్, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

కూడళ్లలో ర్యాలీలు, సభలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జివో నం.1ని రద్దు చేయాలని పౌరసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేయతలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అడ్డుకుని నాయకులను అరెస్టులు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఐక్యవేదిక నాయకులను గృహ నిర్బంధం చేయడం గర్హనీయమని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ఇప్పటికైనా జిఓ నం.1ని రద్దు చేయాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. జివో నం.1కు వ్యతిరేకంగా, అంగన్‌వాడీ సమస్యలపై ఆందోళనలో అరెస్టయిన నాయకులు, కార్యకర్తల పరామర్శకు వెళ్లిన సిపిఎం సీనియర్ నాయకులు పి.మధును అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది.

నిర్బంధాన్ని ఎదిరించి ఉద్యమించారు

- రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అంగన్‌వాడీల ధర్నాలు, రాస్తారోకోలు
- దురుసుగా ప్రవర్తించిన పోలీసులు
- స్పృహ తప్పిపడిపోయిన వర్కర్లు, హెల్పర్లు

ప్రజాశక్తి- యంత్రాంగం



తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు రైల్వేస్టేషన్ వెయిటింగ్ హాల్లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడి ఉద్యోగులు, సిఐటియు నాయకులు

ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదురొడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆయాలు సోమవారం కదంతొక్కారు. అంగన్‌వాడీలకు గత ఎన్నికల ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తెలంగాణలో కంటే వెయ్యి రూపాయలు అధికంగా వేతనం ఇవ్వాలని, అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ అయిన తర్వాత పెన్షన్ ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) సోమవారం 'చలో విజయవాడ'ను పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీనిని భగ్నం చేయడానికి అదివారం నుంచీ ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు, గృహ నిర్బంధాలకు పాల్పడింది. పోలీసులు పలువురికి నోటీసులు ఇచ్చింది. సోమవారం కూడా అడ్డుకోవడానికి ఎక్కడికక్కడ అరెస్టులకు పాల్పడ్డారు. అయినా, భయపడకుండా అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆయాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అరెస్టుల సందర్భంగా పోలీసులు అతిగా వ్యవహరించారు. దీంతో, పార్వతీపురంలో ఆయా, విజయవాడలో అంగన్‌వాడీ వర్కర్ స్పృహ తప్పిపడిపోయారు. అరెస్టు చేసిన చోటే అంగన్‌వాడీలు, ఆయాలు రాస్తారోకోకు దిగారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ వందలాదిమందిని పోలీసులు అరెస్టు చేసి ఆయా ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టులను నిరసిస్తూ పోలీస్ స్టేషన్ల వద్ద అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు ఆందోళనకు దిగారు. ధర్నాలతో కలెక్టరేట్లు, ఆర్‌డిఒ కేంద్రాలు, మండల కేంద్రాలు హోరెత్తాయి. గృహ నిర్బంధాలు రెండో రోజూ కొనసాగాయి. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ధర్నాలో సాలూరు పట్టణానికి చెందిన అంగన్‌వాడీ హెల్పర్ డోకల అరుణ కళ్లు తిరిగి కింద పడిపోయారు. నీడలోకి తీసుకొచ్చి సపర్యలు చేయడంతో ఆమె స్పృహలోకి వచ్చారు. విజయవాడలో అంగన్‌వాడీ టీచర్ బుజ్జి అస్వస్థతకు గురయ్యారు. దీంతో, ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు వాహనాల్లో వెళ్తున్న తూర్పుగోదావరి, విశాఖ, ఏలూరు, పశ్చిమగోదావరి తదితర జిల్లాలకు చెందిన అంగన్‌వాడీలను, ఆయాలను ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద పోలీసులు అడ్డగించి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఉదయం నుంచి టిఫిన్, తాగునీరు లేక, పోలీస్ స్టేషన్ల వద్ద మరుగుదొడ్లు వంటివి లేక మధ్యాహ్నం మూడు గంటల వరకూ వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని కోరుతూ పెదపాడు, ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ల వద్ద సిఐటియు నాయకులు, కార్యకర్తలు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఏలూరు వన్‌టౌన్ పెరుగుచెట్టు సమీపంలోని శ్రీ సీతారాంభర్తియా కల్యాణ మండపంలో సుమారు 150 మంది అంగన్‌వాడీలను పోలీసులు నిర్బంధించి గేట్లు మూసివేశారు. వారిని విడుదల చేయాలని కోరుతూ సిఐటియు నాయకులు రోడ్డుపై పడుకుని ఆందోళన చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 600 మందిని పోలీసులు అరెస్టు చేసి ఆయా స్టేషన్లకు తరలించారు. భీమవరంలో అంగన్‌వాడీలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. రహదారిపై బైఠాయించడం కుదరదని పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి టోల్ గేట్ వద్ద వినుకొండ, చిలకలూరిపేట, ఫిరంగిపురం నుండి వస్తున్న 85 మంది అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేసి మంగళగిరి రూరల్ స్టేషన్‌కు తరలించారు. దీన్ని నిరసిస్తూ వినుకొండలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల నుంచి వెళుతున్న అంగన్‌వాడీలను మేడపి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అరెస్టు చేశారు. త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ అల్లూరు సీతారామరాజు జిల్లా చింతూరు జిల్లా గంగవరం పోలీసు స్టేషన్ ఎదుట, చింతూరు ఐటిడిఎ ఎదుట సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ధర్నా జరిగింది. కాకినాడ జిల్లా సామర్లకోట, ఏలేశ్వరం, పిఠాపురం పోలీస్ స్టేషన్ల వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు రైల్వేస్టేషన్ వెయిటింగ్ హాల్లో అంగన్‌వాడీలను పోలీసులు నిర్బంధించారు.

దీంతో, వారు అక్కడే కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. డాక్టర్ బిఆర్.కోనసీమ జిల్లా రాజోలు, మలికిపురం తహశీల్దార్ కార్యాలయాల వద్ద, కొత్తపేట పోలీస్ స్టేషన్ వద్ద, అంగన్‌వాడీలు ధర్నా చేశారు. నెల్లూరులో అంగన్‌వాడీ కదంతొక్కారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఐసిడిఎస్ కార్యాలయాల ఎదుట, అనంతపురంలో మండల కేంద్రాల వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. తిరుపతి జిల్లా సత్యవేడులో అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. అనంతపురంలో సిఐటియు నాయకులు కళ్లకు కంతలు కట్టుకుని నిరసన తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ, సత్యసాయి కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు.

నష్ట పరిహారం కౌలు రైతులకే ఇవ్వాలి : ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అకాల వర్షాలకు, ఈదురుగాలులకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యావన పంటల ఎన్యూమరేషన్ బృందాల్లో ప్రతి గ్రామంలో ఉన్న కౌలు రైతులను సభ్యులుగా నియమించాలని ఎపి కౌలు రైతుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. సకాలంలో ఎన్యూమరేషన్ పూర్తి చేసి వర్షాలకు నష్టపోయిన వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకే నష్ట పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మిర్చి, పసుపు, మొక్కజొన్న, వరిధాన్యం పంటలు కల్లాల్లోనే తడిచిపోవడంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

మాజీ ఎంఎల్‌సి వట్టి పార్థసారథి కన్నుమూత

ప్రజాశక్తి- భీమడోలు



వట్టి వెంకట రంగ పార్థసారథి (ఫైల్)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ సభ్యులు వట్టి వెంకట రంగ పార్థసారథి (92) ఆదివారం రాత్రి కన్నుమూశారు. వయోభారంతో విజయవాడలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పూళ్ల పంచాయతీ ఎంఎంపురం ప్రాంతానికి చెందిన ఆయన 1982-86 మధ్య శాసనమండలి సభ్యులుగా పని చేశారు. 1968-74, 1992-95 నడుమ డిసిసిబి చైర్మన్‌గా సేవలందించారు. ఆయనకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు, మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. రెండేళ్ల క్రితం భార్య వాసుకి మరణించారు. పార్థసారథి అంత్యక్రియలను ఆయన స్వగ్రామం ఎంఎంపురంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి- వెల్దుర్తి, మార్కాపురం

అప్పుల బాధ తాళలేక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కొసనపల్లి గ్రామానికి చెందిన రైతు పెద్ద బోడెన్నగారి లక్ష్మన్న(43) తనకున్న మూడు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకొని మిరప, ఆముదం పంటలు సాగు చేశారు. సుమారుగా రూ.15 లక్షలు అప్పులు చేశారు. రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో పంటలు దిగుబడులు రాకపోవడంతో అప్పుల భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి తాళలేక పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామ పంచాయతీలోని మాలపాటిపల్లె గ్రామానికి రైతు గొలమారి కోటిరెడ్డి(51)తన నాలుగు ఎకరాల సొంత పొలంతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశారు. రెండేళ్లుగా వర్షాభావం వెంటాడడంతో పంటలు దక్కించుకునేందుకు నాలుగు బోర్లు వేశారు. పంటల సాగు, బోర్లు వేసేందుకు సుమారు రూ.15 లక్షలు అప్పు చేశారు. అప్పులు చెల్లించాలని రుణదాతలు ఒత్తిడి చేయడంతో.. నాలుగు రోజుల క్రితం పొలంలోనే పురుగుమందు తాగారు. పరిస్థితి విషమించి మరణించారు. ఆయనకు భార్య అనంతమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించండి

- డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద ఆందోళన చేస్తున్న కాటి కాపరులు, చిత్రంలో వి. శ్రీనివాసరావు తదితరులు

కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో కాటికాపరుల సమస్యలపై చర్చించి ఒక పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఊరూరా ఉన్న కార్మికులందరినీ ఐక్యం చేసి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. సోమవారం కెవిపిఎస్ అనుబంధ కాటికాపరుల, స్మశానంలో గుంతలు తీసే బేగరుల సంఘం(కెజిబిఎస్) ఆధ్వర్యంలో విజయవాడ రైల్వే స్టేషన్ నుండి ఎర్ర కండువా, పట్టుడు కర్రలతో ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు పార్కు వరకు ప్రదర్శన నిర్వహించారు. పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెజిబిఎస్ నాయకులు ఎన్.జి.కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ వృత్తులను గుర్తిస్తున్నామని బీరాలు పలికే రాష్ట్ర ప్రభుత్వం తరతరాలుగా చనిపోయిన వారిని శ్మశానాల్లో గుంతలు తీసి పూడుస్తూ, కట్టెలు పేర్చి దహన సంస్కారాలు నిర్వహించే కాటికాపరి వృత్తిని ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి తమ గోడు వెళ్లబోసుకునేందుకు విజయవాడకు వస్తున్న వారిని ప్రభుత్వం ఎక్కడికక్కడే నిర్బంధించడం దారుణమన్నారు. విజయవాడ చేరుకున్న కాటికాపరులను సైతం రైల్వే స్టేషన్లో నిర్బంధించి రోడ్లపై కూర్చోబెట్టడం దుర్మార్గమన్నారు. ఒకవైపు అనుమతిచ్చామని చెబుతూనే ధర్నాచౌక్ వద్ద జరగాల్సిన మహాధర్నాను రూటు మార్చి ముత్యాలంపాడు పార్క్ వద్ద నిర్వహించుకోవాలని చెప్పడం ప్రభుత్వ పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, కెజిబిఎస్ రాష్ట్ర నాయకులు ఎమ్‌డి ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రతి శ్మశానంలో మరణ ధ్రువీకరణలు రాసుకునేందుకు పోస్టులు కేటాయించాలన్నారు. వృత్తిదారులకు వృత్తిపరికరాలైన గడ్డపారలు, చెలికలు, గంపలు, రక్షణ పరికరాలైన గ్లౌజులు, మాస్కులు, బూట్లు ప్రభుత్వమే కొనివ్వాలని కోరారు. ప్రతి కార్మికుడు ఆత్మగౌరవంగా బతికేందుకు ఒకొక్కరికి రెండెకరాల పొలం, మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు కట్టివ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్మశానాలు ఆక్రమణలకు గురవ్వకుండా చుట్టూ ప్రహరీ నిర్మించి ప్రభుత్వం పరిరక్షించాలని, బోర్లు షెడ్లు వేయించాలన్నారు. ఈ ధర్నాలో ఎపిడికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్, కోస్తాంధ్ర సమితి నాయకులు సుదర్శన్‌రావు, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నటరాజు, సహాయ కార్యదర్శి కె.రంగమ్మ, రాష్ట్ర నాయకులు కుటుంబరావు, రామదాసు, విజయమ్మ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో 7.7 కోట్ల మందికి మధుమేహం

హైదరాబాద్ : దేశంలో 7.7 కోట్ల మంది పైగా మధుమేహంతో బాధపడుతున్నారని అబాట్ న్యూట్రిషన్ బిజినెస్ మెడికల్ అఫైర్స్ రహెడ్ డాక్టర్ ఇర్ఫాన్ షేక్ అన్నారు.2045 నాటికి 13.5 కోట్లకు చేరొచ్చని అంచనా వేశారు. ఈ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాల్లో దేశంలో మధుమోహంతో బాధపడుతున్న వారి సంఖ్య 150 శాతం పెరిగిందన్నారు. పట్టణీకరణకు తోడు ప్రజల అహార అలవాట్లు ఈ రోగానికి ప్రధాన కారణాలన్నారు. జోస్లిన్ డయాబెటిస్ సెంటర్‌లోని ఇన్ పేషేంట్ డయాబెటిస్ ప్రోగ్రామ్ డైరెక్టర్, ఒబేసిటీ క్లినికల్ ప్రోగ్రామ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఓసామా హమ్దీ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కొనసాగిస్తూ వచ్చిన అహారపు అలవాట్లను వదిలివేయడాన్ని షుగర్ వ్యాధి గ్రస్తుల్లో గమనించవచ్చున్నారు.



విజయవాడలో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల అరెస్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా చేపట్టిన మధ్యాహ్న భోజన కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కల్పన, విజయమ్మ, పద్మతోపాటు మరో 15 మంది ఉన్నారు. అంతకముందు ధర్నా చౌక్‌లో జరిగిన ధర్నాను ఉద్దేశించి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం ఇవ్వాలని, ప్రతినెలా ఐదోతేదీ లోపు వేతనాల బిల్లులు ఇవ్వాలని కోరారు. మెనూ ఛార్జీలు రూ.20 ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ.. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని తెలిపారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. నాయకులు కమల, వెంకటేశ్వరరావు, మహాలక్ష్మి, వరలక్ష్మి మాట్లాడారు.

అసెంబ్లీ అరాచకానికి నిలయం : నారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ అరాచకానికి నిలయంగా మారిందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. సోమవారం ఎపి భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలను పట్టుకుని కొట్టడం ఏంటి? అని ప్రశ్నించారు. బుచ్చయ్య చౌదరి వంటి సీనియర్ నేత పట్ల ఇలా వ్యవహరించడం తగదని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమితో వైసిపి పూర్తి నిరాశ నిస్పృహల్లో ఉందని విమర్శించారు. నిరక్షరాస్యులకు ఓటు హక్కు కల్పించి మరీ దొంగ ఓట్లు వేయించుకున్నారని, అయినా వైసిపి ఓడిపోవడంతో నిరాశలో కూరుకుపోయారని పేర్కొన్నారు. అందుకే అసెంబ్లీలో ఇలాంటి అరాచకాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. స్పీకరు, సిఎం జగన్ ఇద్దరూ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, దాడికి పాల్పడ్డ ఎమ్మెల్యేలను శాశ్వతంగా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

అమెజాన్‌లో మరో 9,000 మందికి కోత..

వాషింగ్టన్ : ప్రముఖ టెక్ దిగ్గజం అమెజాన్ మరో 9,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకాలని నిర్ణయించింది. వచ్చే కొన్ని వారాల్లోనే ఈ తొలగింపులు ఉండనున్నాయని అమెజాన్ సిఇఒ ఆండీ జస్సీ పేర్కొన్నట్లు సిఎన్‌బిసి ఓ రిపోర్ట్‌లో తెలిపింది. అత్యధికంగా అమెజాన్ వెబ్ సీరిస్(ఎడబ్ల్యుఎస్), అడ్వర్టజింగ్, ట్విట్చ్, పిఎక్స్‌టి విభాగాల్లో అధికంగా తొలగింపులు ఉండొచ్చని తెలుస్తోంది. ఇంతక్రితం డిసెంబర్- జనవరి కాలంలో ఈ సంస్థ 18వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. గత వారం మెటా మరో 10వేల మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నట్లు తెలిపింది. ఇంతక్రితం ఈ సంస్థ కూడా 11వేల మందికి ఉద్వాసన పలికింది.

అనుమానాస్పద స్థితిలో సిఐఎస్‌ఎఫ్ సిఐ మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

అనుమానాస్పదస్థితిలో సిఐఎస్‌ఎఫ్ సిఐ మృతి చెందిన ఘటన విశాఖ నగరంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. సిఐ ఎన్.వెంకట శ్రీరామ శర్మ (53) ఈ నెల 18న ఉదయం 6:30 గంటల ప్రాంతంలో ఎంవిపి.కాలనీ సిబిఐ క్యాంపస్‌లోని షటిల్ కోర్టుకు వెళ్లారు. కొద్ది సేపటికే ఉన్నట్టుండి కుప్పకూలిపోయారు. సహచరులు గమనించి మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు.

గుండెపోటుతో ఆత్మకూరు సిఐ మృతి

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్



గుండెపోటుతో నెల్లూరు జిల్లా ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు(48) మరణించారు. సోమవారం మధ్యాహ్నం గుండె నొప్పిగా ఉందని ఆయన తన భార్యకు చెప్పారు. వెంటనే ఆమె ఎస్ఐకి విషయం చెప్పింది. స్థానిక అభిరామ్ ఆస్పత్రికి నాగేశ్వరరావును తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహానికి ఎస్‌పి నివాళులర్పించారు.

బిసి, మైనార్టీలకు సమాన అవకాశాలు

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - కదిరి టౌన్



మహిళా కూలీలతో కరచాలనం చేస్తున్న లోకేష్

టిడిపి అధికారంలోకి రాగానే బిసి, మైనార్టీలకు రాజకీయంగా, ఇతర అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీనిచ్చారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర సోమవారం శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో 48వ రోజు కొనసాగింది. నల్లచెరువు మండలం జోగన్న పేట విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన యాత్ర అల్లగుండు, మొటుకుపల్లి మీదుగా కదిరి పట్టణానికి చేరుకుంది. కదిరిలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బిసి, ముస్లిములతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. దామాషా ప్రాతిపదికన చట్టసభల్లో బిసి, ముస్లిములకు ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వ హయాంలో బిసిల సంక్షేమం కోసం సత్యపాల్ కమిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కార్పొరేషన్ల పేరుతో బిసిలను సిఎం జగన్ మోసం చేశారని విమర్శించారు. ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పరిటాల శ్రీరామ్, సబితమ్మ, మాజీ ఎమ్మెల్సీ గుండెమల తిప్పేస్వామి పాల్గొన్నారు. మంగళవారం కదిరి నుంచి పాదయాత్ర ప్రారంభం కానుంది.

సంపాదకీయం


విద్యావంతుల వివేకం

శాసన మండలి మూడు పట్టభద్రుల నియోజక వర్గాలకు జరిగిన ఎన్నికల్లో అధికార వైసిపి ఓటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఇచ్చిన ప్రజా తీర్పుగా భావించవచ్చు. అనర్హులను ఓటర్లుగా నమోదు చేయించడం, డబ్బు వెదజల్లడం, అధికార దుర్వినియోగం, దొంగ ఓట్ల వంటి అక్రమాలకు పాల్పడ్డప్పటికీ ఎన్నికల్లో అధికార పార్టీకి ఘోర పరాజయం తప్పలేదు. విద్యావంతులు వివేకంతో ఓటు వేసి వైసిపికి బుద్ధి చెప్పారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల, ఇతర కష్ట జీవుల సమస్యలను పరిష్కరించడంలో, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వం వైఫల్యం చెందిన ఫలితమే ఈ తీర్పు. కాగా గ్రాడ్యుయేట్లలో గూడు కట్టుకున్న వ్యతిరేకతను సర్కారు సుతరాం గుర్తింపజాలకుంది. ఎంఎల్‌సి ఎన్నికలను చిన్న ఎన్నికలుగా కొట్టిపారేస్తున్నారు పార్టీ నేతలు. తామిచ్చే పథకాల కేటగిరిలో పట్టభద్రులు లేనందున తీర్పు తమకు వ్యతిరేకంగా వచ్చిందని, అసలు ఈ ఫలితాలు తమకు హెచ్చరిక కానే కాదని విశ్లేషణలకు దిగుతున్నారు. ఎన్నికల మొదట్లో అధికారపక్షమే 2024 సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్‌గా అభివర్ణించింది. రిఫరెండంగా బరిలోకి దిగింది. తీరా ఫలితాలొచ్చాక ఈ ఎన్నికలు అసలు తమకు లెక్కలోనే లేవని మాట మార్చి మడమ తిప్పింది.

ప్రభుత్వం పట్ల ప్రజాభిప్రాయం సేకరించడానికి ఇప్పుడు జరిగిన పట్టభద్రుల ఎన్నికలు విస్తృత నమూనా. ఉత్తరాంధ్ర, రాయలసీమ, పాక్షిక దక్షిణాంధ్ర ప్రాంతాలు, తొమ్మిది జిల్లాలు, 108 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఎన్నికలు జరిగాయి. ఏడు లక్షల పైచిలుకు ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరందరూ ప్రజల్లో భాగమే. ప్రజల నాడి పట్టుకోడానికి ఇది పెద్ద శాంపిల్. అయినప్పటికీ ప్రజా తీర్పును వైసిపి చులకన చేయడం తగదు. ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లల్లో రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, ఉపాధి కల్పన, పరిశ్రమల ఏర్పాటు వంటివిని పట్టించుకోకుండా మూడు రాజధానులను భుజానికెత్తుకుంది. ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలను, ప్రశ్నించేవారిపైనా అక్రమ కేసులు బనాయించి అరెస్టులకు ఒడిగట్టింది. తీవ్ర నిర్బంధ చర్యలు అమలు చేసింది. ఇటువంటి చర్యలను విద్యావంతులు తమ ఓటు ద్వారా నిరసించారు. గ్రాడ్యుయేట్స్ ఎన్నికల ఫలితాలను ప్రభుత్వం పట్ల తిరుగుబాటుగా, ప్రతిఘటనగా చూడాలి. గత అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 50 శాతం ఓట్లు సాధించిన వైసిపి ఈ ఎన్నికల్లో 35 శాతానికి దిగజారింది. అధికారపార్టీ కంటే టిడిపికి 7 శాతం ఎక్కువ ఓట్లు వచ్చాయి. ఎన్నికలు జరిగిన రెండు టీచర్స్ స్థానాల్లో వైసిపి గట్టెక్కడానికి అనర్హులను ఓటర్లుగా అనుమతించడం, ప్రైవేటు స్కూళ్ల ఉపాధ్యాయులను నానా రకాలుగా ప్రభావితం చేయడం, చివరికి బెదిరింపులకు పాల్పడడం కారణాలు. అలాగే ఉపాధ్యాయ నియోజక వర్గాల్లో వైసిపి ఓటమి పట్ల టిడిపి ఆసక్తి చూపలేదు. ఇది రాజకీయ వైఫల్యమే!

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి ఈ ఎన్నికల్లో విద్యావంతులు గట్టి గుణపాఠం చెప్పారు. ఆ పార్టీ పోటీ చేసిన అన్ని చోట్లా చెల్లని ఓట్ల కంటే తక్కువ ఓట్లు రావడం ప్రజల్లో బిజెపిపై ఉన్న ఆగ్రహానికి నిదర్శనం. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, గ్రాడ్యుయేట్స్, ప్రజల సమస్యలపై అలుపెరగకుండా, నిస్వార్థంగా పని చేసిన పిడిఎఫ్ అభ్యర్థులు ఓడిపోవడం ప్రజా ఉద్యమాలకు, రాష్ట్ర పురోగతికి నష్టం. రెండు పోట్ల గిత్తల నడుమ పోరులో లేగదూడ నలిగిపోయిన చందం పిడిఎఫ్ ఓటమి. అయినప్పటికీ ఉద్యమాలను, పోరాటాలను మరింత సంఘటితం చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఎన్నికలు వెల్లడిస్తున్నాయి. పట్టభద్రుల తీర్పుతోనైనా ప్రభుత్వం తన విధానాలపై పునరాలోచించాల్సి ఉంది. కానీ అంగన్‌వాడీల చలో, జీవో నెం.1 రద్దు కోరుతూ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆందోళనల నేపథ్యంలో రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న నిరంకుశ చర్యలు ప్రభుత్వ నిర్బంధ వైఖరిలో జడత్వాన్ని సూచిస్తున్నాయి. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం మరింతగా ఐక్య పోరాటాల్లోకి వస్తేనే ప్రభుత్వ మెడలు వంచడం సాధ్యమవుతుంది.

మహనీయుల మాట



విముక్తి ప్రసాదించే వారంటూ ఎవరూ ఉండరు. ప్రజలే తమను తాము విముక్తి చేసుకుంటారు.

- చే గువేరా

'హిందూ ఆర్థిక వృద్ధి రేటు' - అప్పుడు, ఇప్పుడు



> గతంలో ఉండిన "హిందూ రేటు వృద్ధి" అనేది దీర్ఘకాలం పాటు కొనసాగగలిగింది. కాని ఇప్పుడు అదే "హిందూ రేటు వృద్ధి" అలా దీర్ఘకాలంపాటు కొనసాగగలిగే అవకాశాలు లేవు. ఇప్పుడు డిమాండ్‌కు కొరత ఉన్న కారణంగా వృద్ధిరేటు తగ్గుతోంది. ఈ పరిస్థితి మారి డిమాండ్ కొరత తగ్గాలంటే ప్రభుత్వ జోక్యానికి అవకాశం లేదు (నయా ఉదారవాద విధానాల కారణంగా). అందుచేత ఇంక ప్రపంచవ్యాప్తంగా వృద్ధి రేటు పెరిగి ఆ ప్రేరణతో మన దేశంలోనూ కొంత కదలిక రావడం ఒక్కటే మనకు మిగిలిన అవకాశం.

నయా ఉదారవాద విధానాలు అమలు జరగకముందు కాలంలో, అంటే, ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ ఉన్న కాలంలో, భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రతీ ఏడూ 4 శాతం లేదా అంతకన్నా తక్కువగా వృద్ధి నమోదు చేస్తూ వచ్చింది. వలస పాలన కాలంలోనైతే ఎటువంటి వృద్ధీ నమోదు కాలేదు. దానితో పోల్చినప్పుడు ఈ 4 శాతం వృద్ధి అనేది మెరుగు. కాని అది అంత చెప్పుకోదగ్గ వృద్ధి రేటు అని అనలేము. ఇలా ఒక దీర్ఘకాలం పాటు తక్కువ మోతాదులో నిలకడగా అభివృద్ధి కొనసాగడాన్ని "హిందూ వృద్ధిరేటు" అని చాలామంది ఆర్థికవేత్తలు వెటకారంగా అనేవారు (బహుశా అంత తక్కువ వృద్ధిరేటు కొనసాగితే సామాజిక మార్పు జరగడానికి అనంత కాలం పడుతుంది అన్న అర్థంలో ఆ విధంగా అనివుండొచ్చు). ప్రభుత్వ నియంత్రణ నుండి మారి నయా ఉదారవాద విధానాలు అమలు మొదలయ్యాక, జిడిపి వృద్ధి రేటులో వేగం పెరిగింది. ఇది 1980 దశకంలో మొదలై కొంతకాలం కొనసాగింది. ఆ తర్వాత మళ్ళీ జిడిపి వృద్ధిరేటు వేగం తగ్గిపోవడం మొదలైంది. బహుశా అందుకేనేమో ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ మళ్ళీ "హిందూ వృద్ధిరేటు" దశ లోకి జారిపోతున్నాం అని గుర్తు చేశారు.



ప్రభాత్ పట్నాయక్

కరోనా మహమ్మారి విరుచుకు పడకముందే మన ఆర్థిక వృద్ధిరేటు వేగం తగ్గడం మొదలైంది అన్నది తిరుగులేని వాస్తవం. కరోనా కాలంలో ఉత్పత్తి స్థాయి అమాంతం పడిపోయింది. ఆ తర్వాత మళ్ళీ కోలుకుంటున్న తీరు బలహీనంగా ఉంది. ఇదంతా చూసినప్పుడు మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధి వేగం మళ్ళీ తగ్గుముఖం పడుతోంది అన్న నిర్ధారణకు రావడం సహజం. ఐతే గతకాలంలో (అంటే ప్రభుత్వ నియంత్రణలో దేశ ఆర్థిక వ్యవస్థ నడిచిన కాలంలో) కనపడిన వృద్ధిరేటుకు, ఇప్పటి వృద్ధిరేటుకు–ఈ రెండూ తక్కువగానే నమోదు అయినప్పటికీ–మౌలికంగా ఒక తేడా ఉంది. ఆ విషయాన్ని చర్చిద్దాం.

ఈ తేడాను అర్థం చేసుకోవాలంటే ముందు "డిమాండుకు అనుగుణంగా సరుకులు అందించలేకపోయిన వ్యవస్థ"కి (సప్లై కన్‌స్ట్రైన్డ్ సిస్టమ్), "జరిగిన ఉత్పత్తికి తగినట్టుగా సరుకులు కొనగలిగిన పరిస్థితి లేని వ్యవస్థ"కి (డిమాండ్ కన్‌స్ట్రైన్డ్ సిస్టమ్) మధ్య తేడాను గుర్తించగలగాలి. జరిగిన ఉత్పత్తికి తగినట్టు సరుకులు కొనలేని పరిస్థితి ఉంటే అప్పుడు ఆర్థిక వ్యవస్థలో స్థూల ఉత్పత్తి ఎంత ఉండాలనేది ఆ వ్యవస్థలో ఉన్న స్థూల డిమాండ్ నిర్ణయిస్తుంది. అదే మాదిరిగా, ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు కూడా ఆ వ్యవస్థలోని స్థూల డిమాండ్ వృద్ధిరేటు మీద ఆధారపడి వుంటుంది. అంతే తప్ప ఆర్థిక వ్యవస్థలో ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తి స్థాయి మేరకు ఉపయోగించడం జరిగిందా, లేదా అన్న అంశం మీద కాని, పూర్తిస్థాయిలో ఉద్యోగులను పనిలో పెట్టుకోగలిగామా లేదా అన్న అంశం మీద కాని, తగినంత విదేశీ మారక ద్రవ్యం అందుబాటులో ఉందా లేదా అన్న అంశం మీద కాని, ఆహారధాన్యాలు తగినంత మేరకు అందుబాటులో ఉన్నాయా, లేవా అన్న అంశం మీద కాని ఆధారపడి వుండదు.

అదే సప్లై కన్‌స్ట్రైన్డ్ సిస్టమ్‌లోనైతే ఎంత మేరకు ఉత్పత్తి చేయగలం అనేది వ్యవస్థలో ఉన్న ఉత్పత్తి సామర్ధ్యాన్ని పూర్తిగా వినియోగించుకోగలిగామా లేదా అన్న అంశం మీద, ఆ విధంగా వినియోగించుకోడానికి తోడ్పడే ఇతర అంశాలమీద ఆధారపడి వుంటుంది. ఎంత మేరకు ఉత్పత్తి సామర్ధ్యాన్ని వినియోగించుకోగలిగాం అన్నదానిని బట్టి ఆర్థిక వృద్ధిరేటు ఆధారపడివుంటుంది.

సాంప్రదాయంగా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఎప్పుడూ డిమాండ్ కు కొరత ఉన్న (డిమాండ్ కన్‌స్ట్రైన్డ్) వ్యవస్థ గానే ఉంటుంది. అదే సాంప్రదాయంగా సోషలిస్టు వ్యవస్థ ఎప్పుడూ సరఫరా కొరత ఉన్న (సప్లై కన్‌స్ట్రైన్డ్) వ్యవస్థగానే ఉంటుంది. ఈ విషయాన్ని పోలెండ్‌కు చెందిన మార్క్సిస్టు ఆర్థికవేత్త మైకెల్ కాలెక్కీ చాలా కాలం క్రితమే చెప్పాడు. ఉత్పత్తి స్థాపక సామర్ధ్యం అంతా వినియోగించబడకుండా కొంత మేరకు మూలపడిఉండడం, అదే సమయంలో కొంత నిరుద్యోగం ఉండడం, విదేశీ మారకద్రవ్యం కావలసినంత అందుబాటులో ఉండడం, ఆహారధాన్యాలు అందుబాటులో ఉండడం (జనాభాలో కొందరు ఒకవైపు ఆకలితో మాడుతున్నా) – ఈ లక్షణాలన్నీ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఏకకాలంలో కొనసాగుతాయి. అదే సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో అటువంటి లక్షణాలు కనపడవు. అందువలన వనరులు వృధాగా పడివుండడం అనేది సోషలిస్టు వ్యవస్థలో ఉండదు.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి కొనసాగింది. ఐతే అది ఒక ప్రణాళికా విధానపు చట్రానికి లోబడి జరిగింది. ప్రణాళికా విధానం అంటేనే డిమాండ్ కు కొరత ఉండదు అని అర్థం. అందుచేత ఆ కాలంలో ప్రభుత్వ నియంత్రణలో కొనసాగిన పెట్టుబడిదారీ ఆర్థిక విధానం సాంప్రదాయ పెట్టుబడిదారీ విధానం కాదు. స్థాపక సామర్ధ్యం మేరకు ఉత్పత్తి జరగడంలో ఎక్కడైనా వెనుకపట్టు పడితే, వెంటనే డిమాండ్ ను పెంచడానికి వీలుగా ప్రభుత్వ వ్యయం పెంచడం చేసేవారు. అందుకోసం అవసరం అయితే ద్రవ్యలోటు పెంచేవారు. ఆ రోజుల్లో ద్రవ్యలోటు మీద ఎటువంటి నియంత్రణలూ ఏ అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుంచీ ఉండేది కాదు. ప్రభుత్వ నియంత్రణలో కొనసాగుతున్నందున, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు బలవంతంగా తమ ఆదేశాలను అమలు చేసేవిధంగా ఒత్తిడి చేయగలిగే పరిస్థితి ఉండేది కాదు. ఆ కాలంలో వృద్ధిరేటు మీద ప్రతికూల ప్రభావం సప్లై వైపు నుండే ఉండేది. అంటే డిమాండ్ మేరకు సరుకులను సరఫరా చేయగలిగిన పరిస్థితి ఉండేది కాదు. ఉదాహరణకు: ఆహారధాన్యాల సరఫరాకు ఎప్పుడూ కొరత ఉండేది. దేశం ఆ విషయంలో అప్పటికి స్వయం సమృద్ధి సాధించలేదు. దానికి తోడు విదేశీ మారక ద్రవ్యం కొరత కూడా ఉండడం వలన అవసరమైన మేరకు ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా సాధ్యం అయ్యేది కాదు. ఆహారధాన్యాలకు కొరత ఉన్నందువలన ఎప్పుడూ వాటి ధరలు పెరుగుతూ నిత్యం ఎంతో కొంత ద్రవ్యోల్బణం ఉంటూవచ్చింది. కాని ఆ కాలంలో ఎప్పుడూ స్థాపక సామర్ధ్యం మేరకు ఉత్పత్తి జరగకపోవడం అనే ధోరణి ఉండేది కాదు.

నయా ఉదారవాద విధానాలు అమలు మొదలయ్యాక పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. స్థాపక ఉత్పత్తి సామర్ధ్యంలో కొంత భాగం వినియోగంలోకి రాకుండా ఉండిపోవడం ఈ దశలో నిరంతరం కొనసాగుతోంది. దానిని వినియోగంలోకి తేవడానికి ప్రభుత్వం ఏ విధంగానూ జోక్యం చేసుకోలేని స్థితిలో ఉండిపోతోంది. ప్రభుత్వ వ్యయం పెంచడానికి కావలసిన అదనపు వనరులను సమీకరించాలంటే ధనవంతులపై అదనపు పన్నులైనా విధించాలి, లేకుంటే ద్రవ్యలోటును పెంచడానికైనా పూనుకోవాలి. ఈ రెండూ చేయడానికి ప్రభుత్వానికి అవకాశం లేదు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి విధించిన షరతులు అలాంటివి. అందుచేత నయా ఉదారవాద కాలం అంతా మనం వినియోగంలోకి రాని ఉత్పత్తి సామర్ధ్యాన్ని, భారీ నిరుద్యోగాన్ని, అమ్ముడు పోకుండా భారీ పరిమాణంలో పడివున్న ఆహార ధాన్యాలను, ఎక్కువ మొత్తంలో విదేశీ మారక ద్రవ్య నిల్వలను చూస్తున్నాం (విదేశీ ద్రవ్య పెట్టుబడులు స్పెక్యులేషన్ మార్కెట్ లోకి ఎక్కువ మోతాదులో వచ్చి పడుతూ వుండడం దీనికి కారణం). నయా ఉదారవాద కాలంలో ఎక్కువ వనరులు వినియోగంలోకి రాకుండా వృధా అయిపోతూ వుండడం మనకు నిత్యం కనిపించే ఒక ధోరణి. ఇది పూర్తిగా హేతువిరుద్ధం. ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ కొనసాగిన కాలంలో సప్లయ్ వైపు లోటు కారణంగా ఇబ్బందులు వచ్చేవే తప్ప వనరులు వృధా అయిపోవడం అనేది ఉండేది కాదు.

అంతే కాదు. తలసరి ఆహారధాన్యాల వినియోగం డిమాండ్ పెరుగుదల రెండు అంశాలమీద ఆధారపడి వుంటుంది. మొదటిది: తలసరి జిడిపి వృద్ధిరేటు మీద. రెండవది ఆదాయాలు ఆ యా తరగతుల నడుమ ఏ విధంగా పంపిణీ అవుతున్నాయి అన్న అంశం మీద. ఆదాయాల్లో అసమానతలు బాగా పెరిగిపోతే ఆహారధాన్యాల వినియోగం కొసం ఏర్పడే డిమాండ్ తగ్గిపోతుంది. ప్రభుత్వ నియంత్రణ కొనసాగిన కాలంలో ఉత్పత్తి అయిన ఆహారధాన్యాలకు, నయా ఉదారవాద కాలంలో ఉత్పత్తి అవుతున్న ఆహారధాన్యాలకు పరిమాణంలో పెద్ద మార్పు లేదు. నిజానికి అప్పటికన్నా కొంత పరిమాణం తగ్గిందనే చెప్పాలి. కాని ఆ కాలంలో ఆహారధాన్యాల కొరత ఉండేది. ఇప్పుడు ఆహార ధాన్యాల నిల్వలు పేరుకుపోతున్నాయి. అంటే ఆహారధాన్యాల డిమాండ్ లో పెరుగుదల అనేది అప్పటితో పోల్చితే ఇప్పుడు తగ్గిపోయిందన్నమాట. మరి ఇంకోవైపు చూస్తే తలసరి జిడిపి మాత్రం పెరిగినట్టు కనిపిస్తోంది. ఈ విధంగా తలసరి జిడిపి పెరిగినా, ఆహారధాన్యాలకు డిమాండ్‌మాత్రం తగ్గిపోతోందంటే దానర్థం ఆదాయాల పంపిణీలో అసమానతలు బాగా పెరిగిపోయాయన్నమాట. ప్రభుత్వ నియంత్రణ ఉన్న కాలంతో పోల్చితే నయా ఉదారవాద కాలంలో ఆదాయాల మధ్య అసమానతలు బాగా పెరిగిపోయాయి.

> కాని ప్రపంచవ్యాప్తంగా వృద్ధిరేటు పడిపోతోంది. దాని వలన అంతకంతకూ మరింత ఎక్కువగా స్థాపక సామర్థ్యం వినియోగంలోకి రాకుండా నిరుపయోగం అయిపోతోంది. అందువలన మరింత తక్కువగా అదనపు పెట్టుబడులు వస్తాయి. దానివలన వృద్ధిరేటు ఇప్పుడున్నదానికన్నా ఇంకా తక్కువకి పడిపోతుంది. అందుచేత ఇప్పుడున్న వృద్ధిరేటును ఈ స్థాయిలోనైనా కొనసాగించడం సాధ్యం కాదు. దాని ఫలితంగా ప్రస్తుత అసమానతలు మరింతగా పెరిగిపోతాయి. శ్రామిక ప్రజల పరిస్థితి మరింత దిగజారుతుంది.

స్వాతంత్ర్యం వచ్చిన తొలి సంవత్సరాలలో దేశంలోని ఒక్క శాతంగా ఉన్న అత్యంత సంపన్నుల వాటా జాతీయ సంపదలో క్రమంగా తగ్గిపోతూ, 1982 నాటికి 6 శాతానికి చేరుకుంది. నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చాక మళ్ళీ వారి వాటా పెరగసాగింది. 2014–15 నాటికి వారి వాటా 22 శాతానికి పెరిగింది. గత శతాబ్ద కాలంలో ఇంత ఎక్కువ ఎన్నడూ లేదు.

గతంలో ఉన్న "హిందూ రేటు వృద్ధి" మళ్ళీ ఇప్పుడు కనిపించవచ్చు. కాని గతంలో అసమానతలు పెరగలేదు. మరి ఇప్పుడు మాత్రం అసమానతలు పెరిగిపోతున్నాయి. ఇదీ తేడా.

గతంలో ఉండిన" హిందూ రేటు వృద్ధి" అనేది దీర్ఘకాలం పాటు కొనసాగగలిగింది. కాని ఇప్పుడు అదే "హిందూ రేటు వృద్ధి" అలా దీర్ఘకాలంపాటు కొనసాగగలిగే అవకాశాలు లేవు. ఇప్పుడు డిమాండ్‌కు కొరత ఉన్న కారణంగా వృద్ధిరేటు తగ్గుతోంది. ఈ పరిస్థితి మారి డిమాండ్ కొరత తగ్గాలంటే ప్రభుత్వ జోక్యానికి అవకాశం లేదు (నయా ఉదారవాద విధానాల కారణంగా). అందుచేత ఇంక ప్రపంచవ్యాప్తంగా వృద్ధి రేటు పెరిగి ఆ ప్రేరణతో మన దేశంలోనూ కొంత కదలిక రావడం ఒక్కటే మనకు మిగిలిన అవకాశం. కాని ప్రపంచవ్యాప్తంగా వృద్ధిరేటు పడిపోతోంది. దాని వలన అంతకంతకూ మరింత ఎక్కువగా స్థాపక సామర్ధ్యం వినియోగంలోకి రాకుండా నిరుపయోగం అయిపోతోంది. అందువలన మరింత తక్కువగా అదనపు పెట్టుబడులు వస్తాయి. దానివలన వృద్ధిరేటు ఇప్పుడున్నదానికన్నా ఇంకా తక్కువకి పడిపోతుంది. అందుచేత ఇప్పుడున్న వృద్ధిరేటును ఈ స్థాయిలోనైనా కొనసాగించడం సాధ్యం కాదు. దాని ఫలితంగా ప్రస్తుత అసమానతలు మరింతగా పెరిగిపోతాయి. శ్రామిక ప్రజల పరిస్థితి మరింత దిగజారుతుంది.

రఘురాం రాజన్ వృద్ధిరేటు పడిపోతోందని ఎక్కువ ఆందోళన పడుతున్నారు. మళ్ళీ పాతకాలం నాటి వృద్ధిరేటు స్థాయికి చేరుతుందని దిగులు పడుతున్నారు. కాని అప్పటికన్నా ఇప్పుడు శ్రామిక ప్రజల స్థితి మరింత హీనంగా దిగజారుతుంది. మనం ఆందోళన చెందవలసినది దీని గురించే.

(స్వేచ్ఛానుసరణ)

ప్రతిష్టంభనకు ప్రభుత్వానిదే బాధ్యత

కత్తిరింపులు



పార్లమెంటు సమావేశాలు జరగక పోవడానికి కారణాలు అనేకం. చాలా సందర్భాలలో, పార్లమెంట్‌లో ప్రతిష్టంభన సృష్టించడంలో ప్రతిపక్షం కీలక పాత్ర పోషిస్తుంటుంది. ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా అనేక అత్యవసర సమస్యలపై చర్చించాలనే డిమాండ్‌తో నిరసనలు చేపట్టడంతో పార్లమెంట్ స్తంభించింది. అయితే మోడీ హయాంలో పార్లమెంటు కార్యకలాపాలను స్తంభింపజేసే బాధ్యతను మోడీ అభిమానులే భుజానకెత్తుకున్నారని గమనించవచ్చు. పార్లమెంటు ఉభయ సభల్లోనూ అధికార పార్టీకి మెజారిటీ ఉంది. లోక్‌సభలో మెజారిటీ భారీగా ఉంది. దాంతో తమ మాటలతో ప్రత్యర్థులను దెబ్బకొట్టేందుకు ప్రయత్నించారు. అధికార పార్టీ అభీష్టం మేరకు మాత్రమే సభ సాగింది. ఇంత జరుగుతున్నా... పార్లమెంటును గందరగోళ పరిస్థితిలో ఉంచేందుకు బిజెపి ఎందుకు తహతహలాడుతున్నందో చాలా మందికి అర్థం కాలేదు.

నిజానికి మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అధికార పక్షం పార్లమెంట్‌ను తన ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోంది. ప్రతిపక్షాల గొంతు నొక్కివేయడం రివాజుగా మారుతోంది. పార్లమెంటులో ఎంత చర్చ జరగాలనేది ప్రభుత్వ పక్షమే నిర్ణయిస్తున్నది. ప్రతిపక్షాలు ఎంత సమయం మాట్లాడాలనేది కూడా ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. దేశానికి ఎంతో ప్రాధాన్యత ఉన్న అంశాలపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరగా, దానిని తిరస్కరించారు. ప్రభుత్వానికి, ప్రధానికి అసౌకర్యంగా ఉండే ఏ అంశం మీదా పార్లమెంటులో చర్చకు అనుమతించలేదు.

అదానీ గ్రూపు పాల్పడిన మోసానికి సంబంధించి దేశవ్యాప్తంగా గందరగోళం నెలకొన్న తరుణంలో ఈ విషయమై చర్చించాలని ప్రతిపక్షాలు కోరాయి. అదానీతో మోడీకి ఉన్న సాన్నిహిత్యంపై కూడా ప్రజల్లో తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల ప్రశ్నలకు పార్లమెంటులో మోడీ స్వయంగా సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. పార్లమెంటరీ కమిటీ విచారణలో అదానీ బండారం బయటపడాలని ప్రజలు కోరుకుంటున్నారు. చర్చ జరిగితే మోడీ ముసుగు తొలగవచ్చు. అయితే ప్రభుత్వం, అదానీపై ఎలాంటి చర్చను కోరుకోవడం లేదు. అందుకే మోడీ సూచనల మేరకు మంత్రులు, పార్లమెంటు సంభ్యులు చర్చను పక్కకు నెట్టేందుకు పార్లమెంట్‌లో ఇష్టానుసారం ప్రవర్తిస్తూ సభకు అంతరాయం కలిగిస్తున్నారు. అయితే మోడీ హయాంలో భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలను అందుకు సాకుగా చూపారు. అధికారపక్షం విపక్షాల నోరు నొక్కుతున్న తీరు గురించి మాట్లాడి ఆయన భారత్‌ను అవమానించారట. అంటే రాహుల్ క్షమాపణ చెప్పాలి. లేకుంటే పార్లమెంట్‌ను కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతించదు. దీన్నిబట్టి పార్లమెంటును స్తంభింపజేయడంపై ప్రభుత్వ పక్షాల ఎంపీలు, మంత్రులు గుండెలు బాదుకుంటున్నారని భావించవచ్చు. పార్లమెంటును నడపాల్సిన బాధ్యత ఉన్నవారే అడ్డుకుంటున్నారు. వారే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇంతకంటే పెద్ద దెబ్బ ఏముంటుంది?

/'గణశక్తి' సంపాదకీయం /

జనవాక్యం

బాదుడు సెగ తగుల్తోంది

ప్రతి కుటుంబానికీ మేలు చేశామంటూ శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి ఓ రంగుల ప్రపంచాన్ని చూపించే ప్రయత్నం చేశారు. నిజానికి ప్రజలకు ఒనగూరిన లబ్ధి కంటే పన్నుల భారం అధికంగా ఉంది. గతంలో కూడా సంక్షేమ పథకాలు ఉండేవి. సామాన్యులపై పన్నుల భారం మోపాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించేవారు. ఇప్పుడు నిత్యం ఏ విధంగా జనాన్ని పిండుకు తినాలా అన్న కోణంలోనే పాలన సాగుతోంది. నవరత్నాలు అంటూ ప్రచారం చేసుకుంటున్నా నాసిరకం సేవలతో సామాన్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, రోడ్ల పరిస్థితి దయనీయం. పాదయాత్రలో చెప్పిన ఒక్క హామీ కూడా సమగ్రంగా అమలు కాలేదు. వాస్తవాలు దాయలేరు. కప్పిపుచ్చలేరు.

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా.

చేసే పని ఒకటే, వేతనాలే వేరు!

గ్రామీణ, పట్టణ భారతంలో స్త్రీ, పురుషుల వేతనాల మధ్య గణనీయమైన అంతరం వుందని ఇటీవలి ఎన్ఎస్ఓ సర్వేలో వెల్లడైంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజాగా "వుమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2022" సర్వే నివేదికను విడుదల చేసింది. ఒకే రకమైన పనికి మహిళలు, పురుషుల కన్నా తక్కువ వేతనాలు అందుకుంటున్నారని ఆ నివేదిక పేర్కొంది. పైగా, గత దశాబ్ద కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీ పురుష వేతనాల వ్యత్యాసం మరింత పెరిగిందని, పట్టణ ప్రాంతాల్లో తగ్గిందని ఇటీవల ఒక మీడియా కథనం పేర్కొంది.



గతేడాది ఏప్రిల్–జూన్‌లో గ్రామీణ భారతంలో మహిళల వేతన రేటు పురుషుల వేతనంలో సగం నుండి 93.7 శాతం వరకు వుంది. పట్టణ ప్రాంతాల్లో, ఇది సగం నుండి 100.8 శాతం వరకు వుందని నివేదిక వెల్లడించింది. జాతీయ గణాంకాల ప్రకారం, సగటు గ్రామీణ పురుషుల వేతనం రూ.393 వుండగా, మహిళా కార్మికుల వేతనం రూ.265 వుంది. అలాగే పట్టణ ప్రాంతాల్లో పురుషుల వేతనం రోజుకు రూ.483 వుండగా, మహిళలకు రూ.333 వుంది.

గ్రామీణ ప్రాంతాల్లో పురుషులకు రోజువారీ ఇచ్చే వేతనాలు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లలో అత్యధికంగా వున్నాయి. అదే సమయంలో మహిళల వేతనాలు పురుషులతో పోలిస్తే 60 శాతం తక్కువగా వున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లో వేతనాలకు సంబంధించి వేతన వ్యత్యాసం చాలా ఎక్కువగా వుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒకే రకమైన పనికి స్త్రీ,పురుషుల మధ్య వేతనాల్లో అసమానతలు అధికంగా వున్నాయి. కేరళలో గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల రోజువారీ వేతనం దేశంలోకెల్లా అధికంగా రూ.842 వుంది. అదే సమయంలో రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళా కార్మికుల రోజువారీ వేతనం పురుషుల వేతనంలో కేవలం 51.5 శాతంగా అంటే రూ.434 వుంది.

ఉత్తరప్రదేశ్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిషా వంటి ఇతర పెద్ద రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో మహిళల వేతనాలు పురుషుల వేతనాలతో పోలిస్తే 70 శాతం తక్కువగా వున్నాయని ఎన్ఎస్ఓ నివేదిక పేర్కొంది. కర్ణాటకలో మినహా మిగిలిన ఐదు రాష్ట్రాల్లో రోజువారీ వేతనాలు రూ.400 కంటే తక్కువగా వున్నాయి. కర్ణాటకలో పురుషుల వేతనం అత్యధికంగా వుంది. అన్ని రాష్ట్రాల్లో కన్నా ఉత్తరాఖండ్‌లో పురుషులతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో మహిళలు కాస్త ఎక్కువగా సంపాదిస్తారు.

హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వేతన వ్యత్యాసం చాలా తక్కువగా వుంది. పురుషుల వేతనాల్లో 85 శాతానికి పైగా మహిళలకు వేతనం లభిస్తోంది. గుజరాత్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ లలో కూడా వేతన వ్యత్యాసం తక్కువగా వుంది. అక్కడ మహిళలకు బాగానే చెల్లిస్తున్నప్పటికీ పురుషులకు కూడా చాలా తక్కువ వేతనాలే చెల్లిస్తున్నారు.

చాలా రాష్ట్రాల్లో పట్టణ ప్రాంతాల్లో ఇదే రకమైన ధోరణి కనిపిస్తోంది. పురుషులకు అధిక వేతనాలు చెల్లించే చోట వ్యత్యాసం కూడా ఎక్కువగానే వుంటోంది. అదే సమయంలో పురుషులకు తక్కువ చెల్లించే చోట వ్యత్యాసం కూడా తక్కువగానే వుంది. కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో వ్యత్యాసం ఎక్కువగా వుండగా....గుజరాత్, ఒడిషా, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో మొత్తంగా వేతనాలే తక్కువగా వుండడంతో వ్యత్యాసం కూడా తక్కువగా వుంటోంది. 2011–12తో వేతన సమాచారంతో పోలిస్తే మొత్తంగా 19 రాష్ట్రాలకు గానూ 11 రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీపురుషుల మధ్య వేతన అంతరం పెరిగింది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

స్తంభించిన పార్లమెంటు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అధికార, ప్రతిపక్ష ఎంపిల ఆందోళనలతో పార్లమెంటు స్తంభించింది. దీంతో గందరగోళం మధ్య పార్లమెంటు ఉభయ సభలు మంగళవారం నాటికి వాయిదా పడ్డాయి. పార్లమెంటులో ప్రతిష్టంభన ఆరో రోజు సోమవారమూ కొనసాగింది. అదానీ కేసులో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) విచారణకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపిలు ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేయగా, అధికార బిజెపి ఎంపిలు యుకెలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన వెంటనే నిమిషాల్లో సభలు మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడ్డాయి.

లోక్‌సభలో 'నరేంద్ర మోడీ షేమ్ షేమ్, 'వి వాంట్ జెపిసి' అంటూ ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు హోరెత్తించారు. తిరిగి సమావేశమైన ఉభయ సభల్లో పరిస్థితి మార్పు రాలేదు. దీంతో సభలు ప్రారంభమైన నిమిషాల వ్యవధిలో రోజంతా వాయిదా పడ్డాయి. మంగళవారం పార్లమెంటులో రాహుల్ గాంధీ మాట్లాడేందుకు సమయం కోరినట్లు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. 'అనుమతి మంజూరైతే, రాహుల్ గాంధీ పార్లమెంటులో మాట్లాడతారు' అని ఖర్గే పేర్కొన్నారు. అంతకుముందు ప్రతిపక్ష నేతలు సమావేశమై పార్లమెంటులో అనుసరించాల్సిన వైఖరికి సంబంధించి చర్చించారు.

వెయ్యికి చేరువలో కోవిడ్ కేసులు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో 918 కరోనా కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ సోమవారం వెల్లడించింది. కరోనా ప్రారంభం నుంచి 44.8 లక్షల మందికిపైగా కరోనాకు గురయ్యారని, 5,30,806 మరణాలు సంభవించాయని తెలిపింది. రోజువారీ పాజిటివిటీ రేటు 2.08 శాతంగా ఉంది. ప్రస్తుతం కర్ణాటకలో 616, కేరళలో 1796, మహారాష్ట్ర 1308, గుజరాత్ 740, ఢిల్లీ 208, తమిళనాడు 363, తెలంగాణ 237 యాక్టివ్ కేసులున్నాయి. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య 6,350కి చేరింది.

రైతులను రక్షించండి.. దేశాన్ని కాపాడండి

- మోడీ సర్కారుకు గడ్డు రోజులే
- దేశ నలుమూలలకూ ఆందోళన
- కిసాన్ మహాపంచాయత్‌లో ఎస్‌కెఎం నేతలు
- డిమాండ్లపై కేంద్ర మంత్రికి వినతి



సోమవారం రామ్‌లీలా మైదానంలో జరిగిన కిసాన్ మహాపంచాయత్‌కు హాజరైన లక్షలాది మంది రైతులు, ప్రసంగిస్తున్న విజూ కృష్ణన్. ఇన్‌సెట్‌లో రాకేష్ టికాయత్, వడ్డే శోభనాద్రీశ్వరరావు.

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'రైతులను రక్షించండి.. దేశాన్ని కాపాడండి.. కార్పొరేట్లను తరిమికొట్టండి' అంటూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు పిలుపునిచ్చారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడొద్దని, నిరంతర పోరాటమే మార్గం అని స్పష్టం చేశారు. సోమవారం రామ్‌లీలా మైదానంలో జరిగిన కిసాన్ మహాపంచాయత్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది రైతులు పాల్గొన్నారు. ఢిల్లీ నలుమూలల నుండి ప్రదర్శనలతో రైతులు ప్లకార్డులు చేబూని పెద్దపెట్టున నినాదాలు చేస్తూ రామ్‌లీలా మైదానానికి చేరుకున్నారు. మహాపంచాయత్‌లో ఎస్‌కెఎం నేతలు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, రైతులపై వేధింపులకు పాల్పడిన మోడీ ప్రభుత్వానికి గడ్డు రోజులు రానున్నాయని పేర్కొన్నారు. ఈ ఆందోళన దేశ నలుమూలలకూ విస్తరిస్తుందని తెలిపారు. గ్రామాలవారీ రైతులను సంఘటితం చేసి పోరాటంలో భాగం చేస్తామని చెప్పారు. ఏప్రిల్ 30న కిసాన్ మోర్చా జనరల్ బాడీ సమావేశమై భవిష్యత్ పోరాటాలను వివరిస్తుందని పేర్కొన్నారు. అంతకంటే ముందు రాష్ట్రాల్లో ప్రదర్శనలు, యాత్రలు నిర్వహిస్తామన్నారు. మహా పంచాయత్‌లో రైతు నాయకులు రాకేష్ తికాయత్, దర్శన్ పాల్, అవిక్ సాహా, రుల్దు సింగ్ మాన్సా, తాజిందర్ సింగ్ విర్క్, జోగిందర్ సింగ్, ఉగ్రహాన్ తదితర 50 మంది నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు.. రామ్‌లీలా మైదానం, పరిసర ప్రాంతాల్లో దాదాపు 5,000 మంది పోలీసులు, పారామిలిటరీ బలగాలు మోహరించాయి.

దేశమంతటా పోరాటం : విజూ కృష్ణన్

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా దేశమంతటా పోరాటం విస్తరిస్తుందని ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్ అన్నారు. రైతులను, దేశాన్ని కాపాడాలని, కార్పొరేట్ దోపిడీని అంతమొందించాలనేదే తమ పోరాట నినాదమన్నారు. కిసాన్ సభ నేతృత్వంలో మహారాష్ట్ర రైతులు చేపట్టిన లాంగ్ మార్చ్ విజయవంతం కావడాన్ని ఉదహరించారు. రైతులు ఎక్కడ సంఘటితమై పోరాడారో, అక్కడ ప్రభుత్వం దిగొచ్చిందని అన్నారు. దేశంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రత్యామ్నాయ విధానాల కోసం దేశం బలమైన పోరాటాన్ని చూస్తుందని ప్రకటించారు.

కేంద్ర మంత్రితో ఎస్‌కెఎం బృందం భేటీ

అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా ఆధ్వర్యాన కిసాన్ మోర్చా నాయకులు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, సహాయ మంత్రి కైలాష్ చౌదరిని కలిసి పది డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. తమకు ఇచ్చిన లిఖితపూర్వక హామీలను సకాలంలో అమలు చేయకుంటే పెద్దఎత్తున ఆందోళనలు తప్పవని 15 మంది సభ్యుల బృందం హెచ్చరించింది. దీంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి తెలిపారు.

అక్కడ నుంచి ఎస్‌కెఎం నాయకులు మహా పంచాయత్ వేదిక వద్దకు వచ్చి ప్రభుత్వం ఇచ్చిన సమాచారాన్ని రైతులకు వివరించారు. కనీస మద్దతు ధర, రుణమాఫీ, మద్దతు ధరపై కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేసి రైతు నాయకులతో కొత్త కమిటీని వేయాలని, విద్యుత్ బిల్లులను ఉపసంహరించుకోవాలని, రైతులకు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ వంటి డిమాండ్లను కేంద్ర మంత్రికి వివరించారు.

కేరళ తరహాలో రైతు రుణ ఉపశమన చట్టం తీసుకురావాలి : వడ్డే శోభనాద్రీశ్వరరావు

కేరళ తరహాలో జాతీయస్థాయిలో రైతు రుణ ఉపశమన చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం రైతుల పట్ల అంతులేని వివక్ష చూపుతోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన మోడీ.. దాన్ని అమలు చేయలేదని దుయ్యబట్టారు. రైతాంగాన్ని, వ్యవసాయాన్ని, కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తుందని విమర్శించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే విద్యుత్ బిల్లును తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ నిర్వహించిన ఉద్యమంలో మరణించిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎపి నుంచి ఎస్‌కెఎం నేతలు రావుల వెంకయ్య, కెవివి ప్రసాద్, ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, కుర్రా నరేంద్ర, కొల్లా రాజమోహన్, చుండూరు రంగారావు, గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు ఎం యెల్లమందరావు, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య తదితరులు పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

బ్రిటన్‌లో భారత రాయబార కార్యాలయంపై ఖలిస్తాన్ మద్దతుదారుల దాడి

- అమెరికాలోనూ..

న్యూఢిల్లీ : ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు అమృత్‌పాల్ సింగ్ కోసం పంజాబ్ పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేసిన నేపథ్యంలో విదేశాల్లో ఉన్న ఖలిస్తాన్ మద్దతుదారులు రెచ్చిపోతున్నారు. ఇంగ్లండ్ రాజధాని లండన్‌లోని భారత రాయబార కార్యాలయంపై ఆదివారం దాడికి దిగిన ఖలిస్తాన్ మద్దతుదారులు సోమవారం అమెరికాలోనూ ఇదే దుశ్చర్యకు పాల్పడ్డారు. లండన్‌లో భారత రాయబార కార్యాలయంపై ఆదివారం ఖలిస్తాన్ మద్దతుదారులు దాడికి దిగారు. కార్యాలయంపై ఉన్న భారత జెండాను కిందికి దింపి అవమానపర్చారు. ఖలిస్తాన్ జెండాను ఎగురవేశారు. అమెరికాలోని భారత రాయబార కార్యాలయంపై సోమవారం దాడి జరిగింది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయంపైనా ఇదే మాదిరి దాడి జరిగింది. రక్షణ బారికేడ్లను ధ్వంసం చేసుకుంటూ రాయబార కార్యాలయం ప్రాంగణంలోకి దూసుకొచ్చారు. తలుపులు, కిటికిలపై రాడ్లతో దాడి చేశారు. ఖలిస్తాన్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ, ఖలిస్తాన్ జెండాలను ప్రాంగణంలో ఎగురవేశారు. కాగా, ఈ దాడిపై శాన్‌ఫ్రాన్సిస్కో పోలీసులు ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. అయితే ఈ దాడిని అమెరికాలోని సిక్కు మత నాయకులు అజయ్ భుటోరియా తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి కారణమైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలో ఆ దేశ పార్లమెంట్ భవనం వెలుపల ఖలిస్తాన్ మద్దతుదారులు ఆందోళన నిర్వహించారు.

బ్రిటన్ దౌత్యవేత్తను పిలిచి తీవ్ర నిరసన తెలిపిన భారత్

లండన్‌లో హై కమిషన్ భవనంపై నుండి ఖలిస్తాన్ అనుకూల ఆందోళనకారులు భారత త్రివర్ణ పతాకాన్ని తొలగించడం పట్ల భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.

ఈ ఘటన పట్ల మండిపడిన భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత బ్రిటన్ హై కమిషనర్ అలెగ్జాండర్ ఎలిస్ పర్యటనలో వుండడంతో ఆయన డిప్యూటీ క్రిస్టినా స్కాట్‌ను పిలిపించింది. భారత విదేశాంగ శాఖ తన నిరసన తెలియచేసింది. భారత దౌత్య ఆవరణ భద్రత పట్ల బ్రిటన్ పూర్తిగా ఉపేక్షించిందని విమర్శించింది. ఈ ఘటన జరగడానికి ముందుగానే లండన్‌లోని ఇండియా హౌస్ వద్ద జరిగిన సంఘటనలు పూర్తిగా ఆమోదయోగ్యం కానివని ఎలిస్ అంతకుముందే తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అనంతరం విదేశీ కామన్వెల్త్, అభివృద్ధి వ్యవహారాలకు సంబంధించిన బ్రిటన్ సహాయ మంత్రి తారిక్ అహ్మద్ కూడా ఈ ఘటనను ఖండిస్తూ ట్వీట్ చేశారు.

దిగొచ్చిన షిండే ప్రభుత్వం

ఒపిఎస్‌తో సమానంగా ద్రవ్య ప్రయోజనాలు : మహారాష్ట్ర ఉద్యోగుల సమ్మె విరమణ


ముంబయి : మహారాష్ట్రలో ప్రభుత్వ ఉద్యోగుల సమ్మెకు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని బిజెపి-శివసేన కూటమి ప్రభుత్వం దిగొచ్చింది. పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)కు సమానంగా ద్రవ్య ప్రయోజనాలు కల్పిస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చింది. దీంతో ఏడు రోజులుగా సాగిన సమ్మెను విరమిస్తున్నట్లు సోమవారం ఉద్యోగులు ప్రకటించారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, కాంట్రాక్టు / అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని, రాష్ట్ర సర్వీసుల్లో ఖాళీగా ఉన్న 2.75 లక్షల పోస్టులను భర్తీ చేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల 14 నుంచి నర్సింగ్ సిబ్బంది, ఉపాధ్యాయులతో సహా వివిధ శాఖలకు చెందిన 17 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సోమవారం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చర్చలు జరిపారు. నూతన పెన్షన్ స్కీమలో ఉన్న ఉద్యోగులకు ఒపిఎస్‌తో సమానంగా ద్రవ్య ప్రయోజనాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన డిమాండ్లను అమలు చేయడానికి ఒక కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బిల్లులు గవర్నర్ ఆపడంపై స్పందన తెలపండి : కేంద్రానికి సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : తెలంగాణ శాసనసభ ఆమోదించిన 10 బిల్లులకు ఆమోదముద్ర వేసేలా గవర్నరు తమిళసై సౌందరరాజన్‌ను ఆదేశించాలని కోరుతూ.. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దివాలాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తూ.. గవర్నరు కార్యదర్శికి నోటీసులు ఇవ్వాలని కోరారు. గవర్నరుకు నోటీసులు ఇవ్వొద్దని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తి చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు ఇస్తామని సుప్రీం కోర్టు తెలిపింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

పుతిన్, జిన్‌పింగ్ భేటీ

ద్వైపాక్షిక, ఆర్థిక సంబంధాల విస్తరణే లక్ష్యం




మాస్కో : రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ సోమవారం నాడిక్కడ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాల విస్తరణపై ఈసమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పుతిన్ ఆహ్వానం మేరకు మూడు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం మాస్కోకు చేరుకున్న జిన్‌పింగ్‌కు ఘన స్వాగతం లభించింది. పరస్పర విశ్వాసాన్ని పెంపొందించడం, ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడం, బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణానికి కృషిని రెట్టింపు చేయడానికి ఈ పర్యటన దోహద పడుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. అనిశ్చితి, పరివర్తన కాలంలోకి ప్రపంచ దేశాలు పయనించే ఈ సమయంలో చైనా-రష్యా సబంధాల ప్రాధాన్యత, ప్రభావం ద్వైపాక్షిక పరిధిని దాటి వుంటుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సీ జిన్‌పింగ్ ఒక లిఖితపూర్వక ప్రకటన చేస్తూ, చైనా-రష్యా ద్వైపాక్షిక సంబంధాలు , అలాగే ఇరు దేశాల ప్రయోజనాలతో కూడిన ప్రధాన అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలు, నూతన శకంలో చైనా-రష్యా వ్యూహాత్మక, ఆచరణాత్మక సహకారం, సమన్వయం వంటి వాటిపై పుతిన్‌తో లోతుగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పర్యటన సత్ఫలితాలను ఇస్తుందన్న విశ్వాసంతో తాను ఉన్నానని చైనా అధ్యక్షుడు తెలిపారు. నూతన శకంలో చైనా-రష్యా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, సమన్వయాన్ని స్థిరంగా అభివృద్ధి చేసుకోడానికి ఇది కొత్త మార్గాలను తెరుస్తుందన్నారు. రెండేళ్ల క్రితం రష్యాలో తాను తొలిసారి పర్యటించినప్పటికి, ఇప్పటికీ ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక ఇరుగు పొరుగు సంబంధాలు చాలా వరకు మెరుగుపడ్డాయని జిన్‌పింగ్ పేర్కొన్నారు. పర్వతాలు, నదులు పంచుకుంటున్న ఈ రెండు దేశాలు సర్వతోముఖాభి వృద్ధికి కొత్త అధ్యాయాన్ని తెరిచాయని అన్నారు. చైనా-రష్యా సంబంధాల మెరుగుదల ఈ రెండు దేశాలకు మాత్రమే కాదు, ప్రపంచ పురోభివృద్ధికి కూడా ఉపయోగపడుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్విత సభ్యత్వ హోదా కలిగిన ఈ రెండు దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు.

హింస కూడదు

ఆదర్శనగర్ కాలనీలో ఒక పార్క్ ఉంది.ఆదివారం వచ్చిందంటే పిల్లలు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. పెద్దలు ప్రతి రోజూ నడక కోసం వస్తారు. ఒక రోజు నలుగురు పిల్లలు పార్కులో తిరుగుతున్న తూనీగల తోకలను పట్టుకుని దానికి దారం కట్టి లాగుతూ, వదులుతూ ఆడుకోసాగారు. సీతాకోకచిలుకలను పట్టుకుని వాటి రెక్కల రంగును వేళ్లకు రాసుకుని తెల్ల కాగితాలపై అద్దసాగారు. ఇదంతా రాఘవయ్య మాస్టారు చూసి, పార్క్ వాచ్‌మాన్‌ను అడిగి సన్నటి తాడును తీసుకొచ్చారు. ఆ నలుగురు పిల్లల వద్దకు చేరి 'పిల్లలూ ఇటు రండి' అని పిలిచారు. పిల్లలు వచ్చి కూర్చోగానే తూనీగల తోకలకు కట్టిన దారాన్నీ జాగ్రత్తగా తెంపి వాటిని వదిలేశారు.'ఇప్పుడు మనం సరదాగా ఒక ఆటాడదాము' అన్నారు మాస్టారు. 'ఓ అలాగే' అన్నారు పిల్లలు. 'ముందుగా మీపేర్లేంటో ఒకరు చెప్పండి?' అన్నారు మాస్టారు. 'నా పేరు రవి, పక్కన ఉన్నది శివ, హరి, శేఖర్' అని చెప్పారు. 'ముందుగా రవి ఇలా వచ్చి పడుకో' అన్నారు మాస్టారు. రవి గడ్డిలో పడుకోగానే మాస్టారు రవి కాలికి తాడు కట్టి 'ఇప్పుడు ముందుకు పాకు' అన్నారు. రవి పాకుతుంటే మాస్టారు వెనక్కు లాగసాగారు. 'అమ్మో కాలు నొప్పిగా ఉంది' అన్నాడు రవి. మిగతా ముగ్గురికీ అలాగే కాలికి తాడు కట్టి లాగారు మాస్టారు, వారు కూడా 'అమ్మో నొప్పి' అని అరిచారు. 'ఇదేంటి తాతగారు ఇలా చేశారు?' అన్నారు వాళ్ళు. 'మీరు తూనీగల తోకలకు దారాలు కట్టి, వాటి తోకలు నొప్పి పుట్టేలా చేశారు.రంగు రంగుల సీతాకోకచిలుకలను పట్టుకుని వాటి రెక్కల రంగును వేళ్లకు అద్దుకుని వాటికి రంగు లేని వాటిగా చేసి వదిలేశారు.నోరు లేని వాటిని హింసించారు. మీ కాలికి తాడుతో కట్టి నొప్పి ఎలా ఉంటుందో తెలియజేయాలని ఇలా చేశాను తప్ప మరొకటి కాదు' అన్నారు మాస్టారు.

'తప్పయ్యింది తాతగారు.. ఇంకెప్పుడూ ఇలా చేయం' అన్నారు ఆ పిల్లలు. 'ఈ భూమ్మీద పశువులు, పక్షులు లాగానే క్రిమికీటకాలు కూడా స్వేచ్ఛా జీవులే. వేటినీ హింసించకూడదు' అన్నారు మాస్టారు. నిజాన్ని గ్రహించిన పిల్లలు మాస్టారుతో జత కట్టి మంచి విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు.

- యు. విజయశేఖర రెడ్డి, 99597 36475



ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ



- వై. గిరితిక, 4వ తరగతి, పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల, తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సంప్రదాయ పద్ధతిలో పిల్లల ఆహారం



ఏ తల్లి అయినా ఎదుగుతున్న బిడ్డకు పాలతో పాటు ఇంకా ఏదైనా ఆహారం ఎలా పెట్టాలి? ఏది పెట్టాలి? దాన్ని ఎలా తయారుచేయాలి? అది బిడ్డకు బలవర్ధకమా? కాదా? అని ఆలోచిస్తుంది. జ్యోతి శ్రీ కూడా ఇలాగే ఆలోచించింది. బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా పాత కాలపు సంప్రదాయ పద్ధతిలో ఆహారం తయారు చేసింది. తరువాత అటువంటి ఆహారాన్నే చాలామంది తల్లులు కోరుకుంటున్నారని తెలుసుకుని దాన్నే వ్యాపారంగా మలుచుకుంది. భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో ఈ ఆహారాన్ని ప్రమోట్ చేస్తున్నట్టు చెబుతోంది.

పూర్వం అమ్మమ్మ, నానమ్మలు, అమ్మల పర్యవేక్షణలో పిల్లలు చాలా పుష్టిగా, ఆరోగ్యంగానూ ఉండేవారు. పిల్లల్ని చూసుకుంటూ, బోలెడు పనులు చేసేవారు. కానీ ఇప్పుడు పిల్లలు పౌష్టికాహార లోపంతో, తరచూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఎక్కువమంది పిల్లలు చిన్నతనంలో కంటిచూపు సమస్యతో బాధపడుతున్నారు. దీనికి కారణం ఆహారంలో సరైన పోషకాలు లేక. దాంతో ఎముకల పుష్టి కూడా ఉండటం లేదు. దీన్ని అధిగమించాలంటే బాల్యంలోనే మంచి ఆహారం ఇవ్వాలి. అది ఏంటి? ఎలా ఉండాలి? అన్నదే చాలా మంది తల్లుల ప్రశ్న.

అందుకే సహజ సిద్ధంగా పండిన రాగులు, పప్పులు, ఎర్ర బియ్యం, డ్రై ఫ్రూట్స్ మిశ్రమాలను రోకళ్లు, తిరగళ్లతో పౌడర్ చేసి, జల్లించి జ్యోతిశ్రీ 'న్యూట్రెట్' బేబి పౌడర్‌గా అందిస్తోంది. తన బిడ్డకు పెట్టిన ఆ పోషక ఆహారాన్ని, తోటి పిల్లలూ తింటే బాగుండని ఆశించింది. ఇంటి దగ్గర కొంతమంది మహిళల సహాయంతో ఫుడ్ పౌడర్ తయారుచేయిస్తోంది. దాన్ని కొన్ని వేలమంది పిల్లలు ఇష్టంగా తింటున్నారు. వారి ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఎంతో మంది తల్లుల నమ్మకానికి, సంతోషానికి కారణమైంది.

అమ్మమ్మ సూచనతో ...

తూర్పు గోదావరి జిల్లా మలికిపురం మండలానికి చెందిన పప్పు జ్యోతి శ్రీ చెన్నైలో శ్రీ రామచంద్ర యూనివర్శిటీలో ఫార్మసీ చేశారు. ప్రాక్టీస్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. పన్నెండేళ్ల క్రితం ఆమెకు వివాహం అయ్యింది. కొడుకు పుట్టాడు. నెలలు గడిచే కొద్ది బిడ్డకు ఆహారం ఏం పెట్టాలా? అని ఆరా తీసింది. బయట చాలా షాపులు తిరిగింది. ఉన్న ప్రయివేటు కంపెనీల ఫుడ్ ప్రొడెక్టు ప్యాకెట్లలో పెద్దగా పోషకాలు లేవు. వాటిలో ఎటువంటి పౌడర్ కలుపుతున్నారో ప్యాకెట్ల మీద లేదు. ఆ పౌడర్ ఫుడ్ వల్ల పిల్లల్లో భవిష్యత్తులో దుష్ప్రభావాలూ వస్తాయని తెలుసుకుని బాధపడింది. పిల్లల డాక్టర్లను, స్నేహితులను సంప్రదించింది. వారి సూచనలు, సలహాలు తీసుకొంది. చివరకు తానే స్వయంగా ఆహారం తయారు చేయాలనుకుంది. తన అమ్మమ్మను సలహా అడిగింది. అప్పుడు ఆమె తనకు పుట్టిన పిల్లలకు పెట్టిన ఆహారం గురించి చెప్పింది. బియ్యం, జొన్నలు, రాగులు, పెసలు, కందిపప్పు వేయించి, చేసిన రవ్వ పిండి గురించి చెప్పింది. వీటిని స్టోన్ గ్రౌండర్ (తిరగలి) ఉపయోగించి పొడి చేసుకోవాలని సూచించింది. అప్పుడే వాటిలో ఉన్న ప్రోటీన్స్ బిడ్డకు అందుతాయని సలహా ఇచ్చింది. ఎలక్ట్రిక్ గ్రైండర్‌ను ఉపయోగించడం వల్ల ఆ ప్రక్రియలో ఆహారం వేడి అయ్యి, పోషకాలు కోల్పోతాయని హెచ్చరించింది. రెండేళ్ల పాటు జ్యోతి అమ్మమ్మ చెప్పిన విధంగా బిడ్డకు చేసి పెట్టుకుంది. కొడుకు ఆరోగ్యంగా ఉండటం, బరువు పెరగడం, ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా తట్టుకుని కోలుకోవడం గమనించింది.

నైపుణ్యాలు పెంచుకుంటూ ...

జ్యోతి ఓ సారి తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని ఓ శుభకార్యానికి వెళ్లింది. అక్కడ కొంతమంది స్నేహితులు 'పిల్లలకు ఆహారం ఏం పెడుతున్నావు? ఆరోగ్యంగా ఉన్నారు' అని అడగడంతో అసలు విషయం చెప్పింది. దాంతో తమకూ తయారుచేసి ఇవ్వమని జ్యోతిని కోరారు. అప్పుడే ఆమెకు 'న్యూట్రెట్' బిజినెస్ ప్రారంభానికి బీజం పడింది. భర్త, కుటుంబీకుల సలహాతో ఎనిమిదేళ్ల క్రితం వ్యాపారం ప్రారంభించింది. పప్పులను ఎండబెట్టేందుకు, గ్రౌండ్ చేసేందుకు గానూ ఇంటి పక్కనే ఉన్న ముగ్గురు మహిళల సహాయం తీసుకుంది. వారికి రోజూ వారి కూలి ఇస్తూ ఉపాధి కల్పించింది. గ్రామీణ ప్రాంతంలో అందుబాటులో ఉన్న తిరగళ్లు, రోళ్లు, రోకళ్లు పరికరాలను ఉపయోగిస్తున్నారు. సహజమైన హ్యాండ్ పౌండింగ్ పద్ధతిని చూసి బిడ్డ తల్లులు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. రుచి కూడా బాగుండటంతో పిల్లలు ఇష్టంగా తింటున్నారని చాలా మంది తల్లులు అంటున్నారు. వ్యాపారాన్ని ప్రారంభించిన ఆరు నెలల్లో 5 వేల మంది కస్టమర్‌లను సంపాదించుకుంది. ఆ తర్వాత ఈ సంఖ్య 12 వేలకు పెరిగింది. అంతేకాదు కస్టమర్స్ అడిగిన వంటకాలనూ చేస్తోంది. బిపి, డయాబిస్ ఉన్నవారు తినే విధంగా బిస్కెట్లు తయారుచేయిస్తోంది. గ్రామంలో సుమారు 40 మంది మహిళలు జ్యోతి దగ్గరకు వస్తున్నారు. వీరిలో కొంతమంది మినుములు, కందిపప్పు, పెసలు, రాగులు, ఎర్రబియ్యం, పప్పులను ఇళ్లకు తీసుకెళ్లి శుభ్రం చేసి, ఎండబెట్టి, కుండల్లో వేపి గ్రౌండ్ చేసి తీసుకొచ్చి ఇస్తున్నారు. మరో ముగ్గురు ఆ పౌడర్‌ని జల్లించి, మెత్తని పిండిని ప్యాకింగ్ చేసి ఆర్డర్స్ ప్రకారం ప్యాకింగ్ చేస్తున్నారు. మరికొంతమంది పిండి కలిపి, బిస్కెట్లు, రొట్టెలు, లడ్డులు, స్వీట్లు, కారం పదార్థాలు, కుక్కీసు తయారుచేస్తున్నారు. అయితే ఆర్డర్స్ వచ్చిన దాన్ని బట్టే ఫుడ్ తయారు చేయిస్తోంది. అలా వ్యాపారంలో నష్టం రాకుండా జాగ్రత్త పడుతోంది జ్యోతి. మొదట్లో ఆదాయం తక్కువగా ఉన్నా... ఇప్పుడు మాత్రం నెలకు లక్ష వరకూ లాభం వస్తోంది.

అడ్డంకులు ఎదురైనా

మలికిపురం మండలం అయినా రవాణా మార్గానికి అనువైన సౌకర్యం లేదు. అక్కడ నుంచి ఈ ఆహార పదార్థాలను సుదూర ప్రాంతాలకు పంపించాలంటే చాలా కష్టంతో కూడుకుంది. అయినా తెల్లవారు జామునే ప్యాకింగ్‌లను తీసుకుని పట్టణానికి చేరుతుంది. అక్కడ నుంచి కొరియర్స్ ద్వారా కస్టమర్లకు ఆహార పదార్థాలు పంపుతోంది. లాభం కోసం ఆలోచించకుండా పిల్లల ఆహారం కోసం, ఆరోగ్యకరమైన తరం కోసం కృషి చేస్తున్న జ్యోతిని పలువురు పసిబిడ్డల తల్లులు అభినందిస్తున్నారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు


శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద మహాధర్నా

మధు అరెస్టు


అనంతపురంలోని గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

విజయవాడలోని అంగన్‌వాడీల ఆందోళనలో స్పృహ కోల్పోయిన మహిళలు



విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ వర్కర్ బుజ్జి


కర్నూలు జిల్లా కోడుమూరులో ధర్నా


కాకినాడ కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న మగ పోలీసులు

సిహెచ్ నర్సింగరావు అరెస్టు










విజయవాడలో..


కడప జిల్లా బద్వేలులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన


ఏలూరు కల్యాణ మండపంలో నిర్బంధించిన వారిని వెంటనే విడుదల చేయాలని రోడ్డుపై పడుకుని ఆందోళన

ఐదేళ్లకే టీచర్ల బదిలీ

ఉపాధ్యాయ సంఘాలతో బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే ఉపాధ్యాయుల బదిలీలకు గరిష్టపరిమితి ఐదేళ్లుగా పరిగణనలోకి తీసుకుంటామని విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. కోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ఆదేశాలు ఇస్తామన్నారు. విజయవాడలో సమగ్ర శిక్షా కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సోమవారం చర్చలు జరిపారు. ఉపాధ్యా యులు అడిగిన పలు అంశాలపై ఆయన సాను కూలంగా స్పందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని, ఒత్తిడికి గురికావొద్దని అన్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణ సందర్భంలో జరుగుతున్న అంశాలను పరిశీలిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన షోకాజ్ నోటీసులను, పర్యవేక్షణ సందర్భంగా ఇచ్చిన నోటీసులకు సంబంధించి పరిశీలన చేసి తగు న్యాయం చేస్తామని తెలిపారు. అవసరమైతే ప్రతి ఉన్నత పాఠశాలలో ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను నియమిస్తామని చెప్పారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి సర్వీస్ రూల్స్ డ్రాప్‌ను అందిస్తామని, దీనిపై సవరణలు ఈ నెల 30వ తేదీలోపు ఇవ్వాలని కోరారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతామన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీ లు ప్రమోషన్లు కూడా సర్వీస్ రూల్స్ రూపొందించిన అనంతరం ఇస్తామని, మిగిలిన పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల పర్యవేక్షణ సందర్భంగా విద్యాశాఖ అధికారులు ఇచ్చిన చార్జ్ మెమోలను సస్పెన్షన్లను ఎత్తివేయాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం చేసిన ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ప్రతాప్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, జాయింట్ డైరెక్టర్లు మువ్వా, రామలింగం, మేరిచంద్రిక, ఎపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఎస్‌టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హెచ్ తిమ్మన్న, సాయి శ్రీనివాస్, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయవాడ వివిధ ప్రాంతాల్లో అంగన్‌వాడీల అరెస్టులు

జింఖానా గ్రౌండ్స్	160
గరవ్నర్‌పేట పోలీసుస్టేషన్	160
ఎఆర్ గ్రౌండ్	400
కృష్ణలంక	30
ఆర్‌ఆర్ పేట	200
సూర్యారావుపేట	250
పాయకాపురం	100
మాచవరం	40
పడమట	400
షణ్ముఖ రెసిడెన్సీ	130
ఇబ్రహీంపట్నం	97
ఆటోనగర్‌టెక్నీషియన్స్ హాల్	200
నున్న పోలీసుస్టేషన్	200
అజిత్‌సింగ్‌నగర్ పోలీసుస్టేషన్	200
భవానీపురం	90
1టౌన్ పోలీసుస్టేషన్	130
మొత్తం	**3317**

కేంద్రం అప్పు రూ.155 లక్షల కోట్లు

- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అప్పు రూ.155.8 లక్షల కోట్లని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో బిఆర్ఎస్ ఎంపి నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం అప్పు జిడిపిలో 57.3 శాతమని అన్నారు. ఇందులో రూ.7.03 లక్షల కోట్లు (2.6 శాతం) విదేశీ అప్పు అని తెలిపారు.

93,384 పోలవరం బాధిత కుటుంబాలకు అందని పరిహారం

93,384 పోలవరం బాధిత కుటుంబాలకు ఎటువంటి పరిహారం అందలేదని కేంద్ర జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడ తెలిపారు. రాజ్యసభలో టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 1,06,006 పోలవరం బాధిత కుటుంబాలుగా గుర్తించామని, అందులో 12,622 కుటుంబాలకు పరిహారం, పునరావాసం కల్పించి తరలించామని తెలిపారు. 93,384 పోలవరం బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదని అన్నారు.

వైజాగ్ మెట్రోకు ప్రతిపాదనలు సమర్పించని ప్రభుత్వం

వైజాగ్ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించలేదని కేంద్ర పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. ఎంపి జివిఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలు పంపిందని, అయితే కేంద్ర ప్రభుత్వం 2017 మెట్రో రైలు ప్రాజెక్టు విధానం ఆధారంగా తిరిగి ప్రతిపాదనలు పంపాలని కోరిందని అన్నారు. ఎపి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని పేర్కొన్నారు.

విచారణను ఎదుర్కోవాల్సిందే

- ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మికి స్పష్టం చేసిన 'సుప్రీం'

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దాల్మియా సిమెంట్‌కు సున్నపురాయి గనుల కేటాయింపు వ్యవహారంలో విచారణను ఎదుర్కోవాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మికి స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు వచ్చిన మూడేళ్ల తరువాత పిటిషన్‌ను సవాల్ చేయడమేమిటంటూ ఆమెపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సున్నపురాయి గనుల కేటాయింపులో శ్రీలక్ష్మిపై అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద దాఖలైన కేసులను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సిబిఐ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఇతర సెక్షన్లలోని కేసుల కింద విచారణను ఎదుర్కోవాలని హైకోర్టు 2017లో ఇచ్చిన తీర్పును శ్రీలక్ష్మి సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. వేర్వేరుగా దాఖలైన ఈ పిటిషన్లను సోమవారం జస్టిస్ ఎస్ రవీంద్రభట్, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన విచారణ జరిపింది. రెండు పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం తెలుపగా, తమ పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని శ్రీలక్ష్మి తరపున సీనియర్ న్యాయవాది కెవి విశ్వనాథన్ విజ్ఞప్తి చేశారు. పిటిషన్ ఉపసంహరణకు ధర్మాసనం అంగీకరిస్తూ కేసు విచారణను ముగించింది.

రాష్ట్ర ప్రభుత్వాన్ని తక్షణమే రద్దు చేయాలి: కొనకళ్ల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం తక్షణమే రద్దు చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఎపి భవన్‌లో మీడియాతో మాట్లాడారు. స్పీకరు సాక్షిగా సభ్యులపై దాడి సిగ్గుపడాల్సిన దుస్థితి అని అన్నారు. దళిత సభ్యుడుపై దాడికి పాల్పడ్డారని విమర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర పరాభవం ఎదురవడంతో జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఎపి అసెంబ్లీలో జరిగిన ఘటనలపై కేంద్రం జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

5వ ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు

- హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

అమరావతి-ప్రజాశక్తి

రాష్ట్ర ఐదో స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌ను (ఎస్ఎఫ్‌సి)ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు హైకోర్టుకు ప్రభుత్వం చెప్పింది. ఈ మేరకు మెమోను ప్రభుత్వ అడ్వకేట్ శ్రేయాస్ రెడ్డి అందజేశారు. మెమోను చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ రావు రఘునందర్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం పరిశీలించింది. వ్యాజ్యాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రత్నకుమారి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని ప్రభుత్వం తరపున న్యాయవాది తెలిపారు. నాలుగో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ పదవీ కాలం 2020లో ముగిసినా ఐదో స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేయలేదని గొలమారు వెంకటరెడ్డి దాఖలు చేసిన పిల్‌పై విచారణ ముగిసింది.

టాప్‌లోకి ఢిల్లీ



ప్లే-ఆఫ్‌కు యుపి

లీగ్ దశలోనే నిష్క్రమించిన బెంగళూరు, గుజరాత్

నేటితో ముగియనున్న లీగ్ పోటీలు

ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) ప్లే-ఆఫ్ బెర్త్‌లు ఖరారయ్యాయి. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో యుపి వారియర్స్ జట్టు 3వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్‌పై గెలిచి ప్లే-ఆఫ్‌కు చేరుకోగా.. ఢిల్లీ జట్టు 9వికెట్ల తేడాతో ముంబయిని ఓడించి అగ్రస్థానానికి ఎగబాకింది. డివై పాటిల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ నిర్దేశించిన 110పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ జట్టు కేవలం 9 ఓవర్లలో వికెట్ కోల్పోయి ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 109పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్(23), పూజ వస్త్రాకర్(26), వాంగ్(23), అమన్‌జ్యోత్ కౌర్(19) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఢిల్లీ బౌలర్లు కాప్, శిఖా పాండే, జొన్నాసేన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ ఓపెనర్ షెఫాలీ వర్మ(33), కెప్టెన్ లానింగ్(32)కి తోడు కాప్సే(38) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కాప్సేకి లభించింది. ఇక బ్రాబౌర్న్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 178పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. హేమలత(57), గార్డినర్(60) అర్ధసెంచరీలతో రాణించారు. గైక్వాడ్, పార్శవి చోప్రాకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో యుపి వారియర్స్ జట్టు 19.5ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 181పరుగులు చేసి విజయం సాధించింది. మెక్‌గ్రాత్(57), హ్యారీస్(72)కి తోడు ఎక్లేస్టోన్(19) బ్యాటింగ్‌లో రాణించారు. కిమ్ గరాత్‌కు రెండు, మోనిక, గార్డినర్, కన్వర్, స్నేహ్ రాణాకు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ ఓటమితో గుజరాత్ ప్లే-ఆఫ్ ఆశలు దారులు మూసుకుపోయాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గ్రేస్ హ్యారీస్‌కు లభించింది. దీంతో యుపి జట్టు 8పాయింట్లతో మూడోస్థానంలో నిలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ప్లే-ఆఫ్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఢిల్లీ జట్టు 10పాయింట్లతో అగ్రస్థానానికి ఎగబాకగా.. ముంబయి జట్టు ఖాతాలో 10 పాయింట్లు ఉన్నా.. రన్‌రేట్ ప్రాతిపదికగా రెండోస్థానంలో నిలిచింది. నేడు జరిగిన మ్యాచ్‌లతో లీగ్ పోటీలు ముగియనుండగా.. శుక్రవారం(24న) ఎలిమేటర్, ఆదివారం(26న) ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

డబ్ల్యుపిఎల్‌లో నేడు...

బెంగళూరు × ముంబయి
(వేదిక: డివై పాటిల్ స్టేడియం; మ.3.30గం॥లకు)

యుపి × ఢిల్లీ
(వేదిక: బ్రాబౌర్న్ స్టేడియం, రా.7.30గం॥లకు)

అక్రమ అరెస్టులను నిరసించండి

- సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ అరెస్టులను నిరసించాలని సిఐటియు పిలుపునిచ్చింది. అక్రమ అరెస్టులకు, నిర్బంధాలకు వ్యతిరేకంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు సోమవారం ఒక ప్రకటనలో అన్ని జిల్లాల కమిటీలకు పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు తమ కోర్కెలపై శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చినా వైసిపి ప్రభుత్వం నిరాకరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాకు తరలివస్తున్న కార్మికులను బస్సులు, రైళ్ల నుంచి దింపివేసి పోలీస్ స్టేషన్లకు తరలించి అరెస్టులు చేశారని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే స్కీం వర్కర్ల కోపాగ్నికి వైసిపి ప్రభుత్వం బలైపోతుందని హెచ్చరించారు.

న్యూజిలాండ్ క్లీన్‌స్వీప్

రెండో టెస్ట్‌లో శ్రీలంకపై ఇన్నింగ్స్ 58పరుగుల తేడాతో గెలుపు

వెల్లింగ్టన్: శ్రీలంకతో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు 2-0తో చేజిక్కించుకొని క్లీన్‌స్వీప్ చేసింది. రెండో టెస్ట్‌లో ఆతిథ్య జట్టు శ్రీలంకపై ఇన్నింగ్స్ 58పరుగుల తేడాతో గెలిచింది. ఫాలోఆన్ ఆడుతూ సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక జట్టు 358పరుగులకు ఆలౌటైంది. టిమ్ సౌథీ, టిక్నెర్‌కు మూడేసి, బ్రాస్‌వెల్‌కు రెండు, హెన్రీ, డోగ్ బ్రాస్‌వెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ జట్టు 580పరుగులు చేయగా.. శ్రీలంక జట్టు 164పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హెన్రీ నికోల్స్‌కు, సిరీస్ కేన్ విలియమ్సన్‌కు లభించాయి. ఇరుజట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ శనివారం(25)నుంచి ప్రారంభం కానుంది.

10 బిల్లులకు శాసనసభ ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ సోమవారం 10 బిల్లులను ఆమోదించింది. ఆమోదం పొందిన బిల్లుల్లో ఎయిడెడ్ పాఠశాలలు, గ్రంథాలయాల్లో పనిచేస్తున్న 5,231మంది ఉద్యోగులకు పదవీ విరమణ 60 నుంచి 62 వరకు పెంచుతూ రూపొందించిన ఎపి ఎడ్యుకేషన్ సవరణ బిల్లును మంత్రి బొత్స సత్యనారాయణ ప్రతిపాదించారు. హిందూ ధార్మిక మత సంస్థల ధార్మాదాయ సవరణ బిల్లును డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ప్రతిపాదించారు. రాష్ట్ర అల్పసంఖ్యాక వర్గాల కమిషన్ సవరణ బిల్లును డిప్యూటీ సిఎం అంజాద్‌భాష ప్రవేశపెట్టారు. రిజిస్ట్రేషన్ల చట్ట సవరణబిల్లును రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. ఆబ్కారీ చట్ట సవరణ బిల్లు, మద్యనిషేధ సవరణ బిల్లులను మంత్రి నారాయణస్వామి ప్రతిపాదించారు. న్యాయవాదుల సంక్షేమ నిధి చట్ట సవరణకు మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రవేశపెట్టగా సభ ఆమోదం లభించింది. బిసి కమిషన్ చట్టసవరణ బిల్లు, రాష్ట్ర పాలసేకరణ, రైతుల సంరక్షణ పాల సరఫరా, పాలయొక్క సురక్షిత ప్రమాణాల అమలు బిల్లుకు ఆమోదం లభించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68